ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888


Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -12 పేజీలు - 8 వెల - 03/- గురువారం 7 మే 2026

# భారీ పెట్టుబడులకు ఆమోదం..!



## సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు సమావేశం



**విశాఖలో రూ.1 లక్ష కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్‌కు గ్రీన్ సిగ్నల్**

**సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్**

**కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు**

**తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమ**

**రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం...**

**39 వేల మందికి ఉద్యోగాలు**

**నిర్దేశిత గడువుకు ముందే అనుమతులతో ఓ బ్రాండ్ సృష్టిద్దాం**

**అమరావతిమే 06 (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి వస్తోంది. విశాఖలో రిలయన్స్ సంస్థ రూ.1,08,010 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. అలాగే సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్ ను, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంను కూడా రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనుంది. కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును, తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. వీటితో పాటు పలు పెట్టుబడులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు బుధవారం ఆమోదం తెలిపింది.
ప్రతీ ఒప్పందం గ్రౌండ్ కావాలిరాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి వచ్చిన ప్రతీ ప్రతిపాదనా ఒప్పందంగా మారాలని, కుదుర్చుకున్న ప్రతీ ఒప్పందం పెట్టుబడిగా రూపాంతరం చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.**మిగతా 2లో...**

# ఉద్యోగాల కల్పనే కూటమి లక్ష్యం




**శ్రీసిటీలో క్యారియర్ ఏసీల తయారీ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి**

**రూ.1000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు.. 3000 మందికి ఉపాధి అవకాశాలు**

**దేశానికి 'కూల్ క్యాపిటల్'గా ఆంధ్రప్రదేశ్: మంత్రి లోకేశ్**

**రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడి**



**తిరుపతిమే 06 (రిపబ్లిక్ న్యూస్):**
ఏపీని పారిశ్రామికంగా, సాంకేతికంగా అగ్రస్థానంలో నిలబెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ప్రపంచ ప్రసిద్ధ ఎయిర్ కండిషనర్ల తయారీ సంస్థ 'క్యారియర్ గ్లోబల్' యూనిట్‌కు రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు కోసం క్యారియర్ సంస్థ సుమారు **మిగతా 2లో...**

# విత్తన సరఫరా వేగంగా చేయాలి

**: చంద్రబాబునాయుడు**

**మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్**

**పంటలకు ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా అధిక ఆదాయం**

**వ్యవసాయ, ఉద్యాన పంటల కొనుగోళ్ల అంశంపై సీఎం చంద్రబాబు సమీక్ష**



**అమరావతిమే 06 (రిపబ్లిక్ న్యూస్):**
ఈ ఏడాది మే 15 నుంచే రైతులకు సాగునీరు అందించనున్న దృష్ట్యా రాష్ట్రంలో వేగంగా విత్తన సరఫరా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయ శాఖకు దిశానిర్దేశం చేశారు. విత్తనాల సరఫరా కోసం రూ.200 కోట్లు కేటాయించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో బుధవారం రాష్ట్రంలో ధాన్యం, అరటి, పొగాకు, ఆయిల్ పామ్ తదితర పంటల కొనుగోళ్లపై ముఖ్యమంత్రి వ్యవసాయ, ఉద్యాన శాఖలతో సమీక్ష నిర్వహించారు.**మిగతా 2లో...**



# 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

**సిఎం అభ్యర్థిపై బిజెపిలో సమాలోచనలు -ప్రమాణస్వీకారానికి భారీగా ఏర్పాట్లు**

**కోల్‌కతా,ఎమే 06 (రిపబ్లిక్ న్యూస్):**
పశ్చిమ బెంగాల్‌లో స్పష్టమైన ఆధిక్యం సాధించడంతో భారతీయ జనతా పార్టీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంది. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే అంశంపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. వారిలో ఒకరిని ఎంపిక చేసేందుకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రాష్ట్రానికి చెందిన కీలక నేతలతో వరుసగా చర్చలు జరుపుతోంది. దీనిపై కసరత్తు జరుగుతుండగానే 9న ప్రమాణ స్వీకార ఏర్పాట్లు సాగుతున్నారు. బెంగాల్ నేత ఎంపికకు పరిశీలకుడిగా కేంద్రహోంమంత్రి అమిత్ షా రానున్నారు. అందుకే మే 9వ తేదీ శనివారం ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార **మిగతా 2లో...**

# మెజారిటీతో రండి

**విజయ్‌కు గవర్నర్ షాక్**

**118 మంది ఎమ్మెల్యే మద్దతు తప్పనిసరి**

**మద్దతు ఇచ్చే పార్టీల లేఖలు అవసరమని సూచన**

**పూర్తి మెజార్టీ ఉంటే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం**

**గవర్నర్ విశ్వనాథ్‌తో భేటీలో విజయ్‌కు స్పష్టీకరణ**

**నేటి ప్రమాణ స్వీకారంపై సందిగ్ధత**

**చెన్నై,మే 06 (రిపబ్లిక్ న్యూస్):**
టీవీకే చీఫ్ విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ షాక్ ఇచ్చారు. తగినంత మెజారిటీ చూపించలేకపోవడంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ అనుమతి నిరాకరించారు. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేలు తప్పనిసరని గవర్నర్ స్పష్టం చేశారు. దీంతో తక్షణం ప్రభుత్వం ఏర్పాటుపై సస్పెన్స్ కొనసాగుతోంది. మద్దతు ఎమ్మెల్యేలు లేదా పార్టీల జాబితా సమర్పించాలని, అప్పుడే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం పలుకుతామని స్పష్టం చేసినట్లు సమాచారం**మిగతా 2లో...**



# నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

**అమరావతిమే 06 (రిపబ్లిక్ న్యూస్):**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ నెల 7వ తేదీ నుంచి రెండు రోజుల పాటు 7వ కలెక్టర్ల సదస్సు జరగనుంది. రాజధాని అమరావతిలోని సచివాలయంలో జరగనున్న ఈ సదస్సులో జిల్లా కలెక్టర్లతోపాటు అన్ని శాఖల అధిపతులు, ముఖ్యకార్యదర్శులు హాజరుకానున్నారు. ఇటీవల కాలంలో ప్రజా ప్రతినిధులతో సిఎం చంద్రబాబు జిల్లాల**మిగతా 2లో...**

# 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను నిలిపివేసిన ట్రంప్

**ఇరాన్‌తో చర్చల్లో పురోగతి**

**అందుకే ఈ నిర్ణయమన్న ట్రంప్**

**ఇరాన్‌పై దిగ్బంధనం మాత్రం కొనసాగుతుందని స్పష్టీకరణ**

**ఇరాన్ సైనిక శక్తిని పూర్తిగా దెబ్బతీశామని వ్యాఖ్య**



# ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

**హైదరాబాద్ :మే 06 (రిపబ్లిక్ న్యూస్):**
ధాన్యం కొనుగోళ్ల అం శంపై విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మంత్రి ఉత్త మ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన సచివాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే రాష్ట్రంలో రికార్డ్ స్థా యిలో ధాన్యం దిగుబడి అయ్యిందని, దేశంలోనే రికార్డ్ స్థాయిలో దిగుబడి ,కొనుగోళ్లు జరిపింది రాష్ట్రంలోనే అని మంత్రి స్పష్టం చేశారు. **మిగతా 2లో...**



# ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం

**విధులకు ఏళ్లుగా గౌర్హాజరు**

**-51 మందిపై వేటు వేసిన ప్రభుత్వం**

**క్రమశిక్షణా రాహిత్యాన్ని ఉపేక్షించేది లేదన్న మంత్రి సత్యకుమార్**

**అమరావతి,మే 06 (రిపబ్లిక్ న్యూస్):**
ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్రమశిక్షణ, రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న వైద్యుల పట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**మిగతా 2లో...**



# ఉద్యోగాల కల్పనే కూటమి లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

రూ. 1,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 3,000 మందికి ఉపాధి, జీవనోపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... క్యారియర్ కేవలం ఒక కంపెనీ కాదని, ప్రపంచ శీతలీకరణ సాంకేతికతలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మార్గదర్శి అని ప్రశంసించారు. తన జీవితంలో కొనుగోలు చేసిన మొట్టమొదటి ఏసీ కూడా క్యారియర్ బ్రాండ్‌దేనని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకుంటూ, సీఎం చంద్రబాబు నాయుడు తన గదిని ఎప్పుడూ 17 డిగ్రీల సెల్సియస్ వద్ద చల్లగా ఉంచుకోవడానికి ఇష్టపడతారని, ఇప్పుడు ఆ గదిలో కూడా క్యారియర్ ఏసీనే ఉందని లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు. దీంతో సభలో నవ్వులు పూశాయి.

**డేటా సెంటర్ల తయారీ హబ్‌గా ఏపీ**

అనంతరం మంత్రి లోకేశ్ రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలపై తన దార్శనికతను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌ను కేవలం డేటా సెంటర్లను ఆకర్షించే రాష్ట్రంగా కాకుండా వాటికి అవసరమైన పూర్తి తయారీ పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించే హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "మేం కేవలం డేటా సెంటర్లను నిర్మించడం లేదు, వాటికి అవసరమైన పూర్తి వ్యవస్థను ఇక్కడే నిర్మిస్తున్నాం" అని ఆయన అన్నారు.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో తీవ్రమైన పోటీ నెలకొని ఉందని, ఈ రేసులో ఏపీ ముందు వరుసలో నిలుస్తుందని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. డేటా సెంటర్లకు అత్యాధునిక కూలింగ్ సిస్టమ్స్, అధిక సామర్థ్యం గల చిల్లర్లు, పవర్ ఎలక్ట్రానిక్స్, ప్రెసిషన్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటివి అత్యంత కీలకమని, వీటికి అవసరమైన బలమైన సహాయక పర్యావరణ వ్యవస్థను నిర్మించడంపై దృష్టి సారించామని వివరించారు.

ఈ బృహత్తర లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను, శ్రీసిటీని ఎంచుకున్నందుకు క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు ఆయన స్వాగతం పలికారు. ఈ పెట్టుబడి రాష్ట్ర డిజిటల్, పారిశ్రామిక అభివృద్ధిని బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. క్యారియర్ వంటి సంస్థల రాకతో, డేటా సెంటర్లకు అవసరమైన కీలక పరికరాల తయారీ స్థానికంగానే జరిగి, ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ టెక్నాలజీ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంటుందని మంత్రి లోకేశ్ తెలిపారు.

# మెజారిటీతో రండి : విజయ్‌కు గవర్నర్ షాక్

**మొదటిపేజీ తరువాయి**

. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను విజయ్ కలుసుకున్నారు. కాంగ్రెస్ మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, పలు పార్టీలుకూడా తమతో చేతులు కలుపనున్నాయని గవర్నర్‌కు విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకుంటానని విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. అయితే విజయ్ వివరణతో గవర్నర్ సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరం కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి టీవీకే వద్ద ప్రస్తుతం 112 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. విజయ్ రెండు సీట్లలో గెలవడంతో ఒక సీటును వదులుకోవడం అనివార్యం. దీంతో టీవీకే చేతిలో 107 మంది సభ్యుల బలం మాత్రమే ఉన్నట్టయింది. కాంగ్రెస్ బలం కూడా కలిపితే టీవీకే బల నిరూపణకు మరో 6 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఐడీఎంకే 47 సీట్లలో గెలవగా, అందులోని ఒకవర్గం టీవీకే వైపు మొగ్గుచూపుతోంది. పీఎంకే-4, ఐయూఎంఎల్-2, సీపీఐ-2, సీపీఎం-2, డీఎండీకే, ఐఎంఎంకే చెరో సీటు కలిగి ఉన్నాయి. టీవీకేకు చిన్న పార్టీల నుంచి మద్దతు లభించే అవకాశాలు బలంగానే ఉన్నాయి. అయితే అధికారికంగా మద్దతు ఇస్తేనే సంఖ్యాబలాన్ని విజయ్ చూపించుకునే అవకాశం ఉంటుంది. టీవీకే అధినేత విజయ్ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. కాగా, తమిళనాడు కొత్త ముఖ్యమంత్రిగా ఈనెల 7వ తేదీన విజయ్ ప్రమాణస్వీకారం చేయడానికి ఏర్పాట్లు కూడా చేసుకున్నారు.. మంచి ముహూర్తం కావడంతో ఉదయం 10 గంటల నుంచి 11.15 గంటల మధ్య విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 5,000 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేసి ఉదయం గురువారం 6 గంటల కల్లా సిద్ధం చేయనున్నట్టు టీవీకే వర్గాలు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం కావడంతో స్టేడియం వద్ద పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

# విత్తన సరఫరా వేగంగా చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

ఈ సమీక్షకు మంత్రి కె. అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా రైతులు పండించే పంటలకు ధరలు దక్కేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా పంటలకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతుకు లాభసాటిగా ఉండేలా నాణ్యమైన పంట దిగుబడులు వచ్చేందుకు కృషి చేయాలని సూచించారు

మరిన్ని పంటలను ప్రకృతి సేద్యం విధానంలో సాగు చేస్తే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నారు. సేంద్రీయ సాగుకు కంపోస్టు ఎరువును సరఫరా చేసేలా చూడాలన్నారు. ఈ ఏడాది 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట ఉత్పత్తి వస్తుందని అధికారులు వివరించారు. మొక్క జొన్న సహా ఇతర పంటల ద్వారా ఇథనాల్ తయారీకి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు.మామిడిని ప్రాసెసింగ్ యూనిట్లు కొనుగోలు చేసేలా చూడాలని అన్నారు. అరటి, ఆయిల్ పామ్, మిర్చి, కోకో లాంటి పంటలకు సంబంధించి ధరల సమస్య లేదని రైతులకు మంచి ధర లభిస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సీజన్ కంటే ముందే రాష్ట్రంలోని నీటి వనరుల్లో ఫిష్ సీడ్ ను సరఫరా చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

వచ్చే పంట సీజన్ కు 7.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. నాఫెడ్ నుంచి మినుములు ఇతర వాణిజ్య పంటల్ని కొనుగోలు చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రికి వివరించారు. పీఎండీఎస్ పథకం ద్వారా తక్కువ యూరియా వినియోగానికి ఇచ్చే ప్రోత్సాహకం పై కేంద్రంతో మాట్లాడాలని వారికి సూచించారు. మదనపల్లె లో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు కానుందని ముఖ్యమంత్రి అన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

**మొదటిపేజీ తరువాయి**

ఈ రబీ సీజన్ లో 67 లక్షల ఎకరాలలో వరి సాగులో, 141 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి రానుందని, 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధమయ్యిందని, ఇప్పటి వరకు ప్రభుత్వం 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ. 2,310 కోట్లు చెల్లించినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాల అంశలో బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గతంలో లే ని విధంగా వసతులు కల్పించామని, అకాల వర్షాలు సంభవిస్తే ధాన్యం తడిసి పోకుండా ఉండేందుకు 2.63 లక్షల టార్పాలిన్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 18.75 కోట్ల గన్ని బ్యాగులు అందుబాటులో ఉం చామని, 64.83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే సామర్థ్యం ఉందన్నారు. అదనంగా 11.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు గోదాముల గుర్తించినట్లు మంత్రి తెలియజేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు గా ను 6,200 వాహనాల ఏర్పాటు చేశామని, కొనుగోలు కేంద్రాలలో రైతులకు దాహార్తి తీర్చేందుకు వీలుగా మం చినీటి సరఫరా, ఓఆర్ఎస్ సరఫరా ఏర్పాట్లు చేశామని మంత్రి చెప్పుకొచ్చారు. కొనుగోలు కేంద్రాలలో ఉద యం, సాయంత్రం కొనుగోలుకు ఆదేశాలు జారీ చేశామని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి నోడల్ అధికారి పర్యవేక్షణ ఉంటుందని, అన్నింటికీ మించి ధాన్యం కొనుగోలు అంశంపై ప్రత్యేకించి పౌ ర సరఫరాల శాఖా కేంద్ర కార్యాలయంలో కంట్రోల్ రూ మ్ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. తాలు పేరుతో కోత విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, తూకం అంటూ తగ్గిస్తే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు.

రైతులకు నష్టం కలిగించే ఏ చర్యను ప్రభుత్వం సమర్ధించదని మంత్రి పేర్కొన్నారు. అకాల వర్షాలు సంభవిస్తే రైతులు, సిబ్బంది చెట్ల కింద, కరెంట్ స్తంభాల దగ్గర ఉంటే పిడుగుపాటుకు గురి కాకుండా సూచనలు చేస్తున్నామని, వాతావరణంలో సంభవిస్తున్న మార్పులను ఎ ప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలకు సమాచారం అం దించేందుకు ప్రత్యేక మెకానిజం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించకుండా ప్రత్యేక టోకెన్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో బిఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మడం లేదని, వరుసగా నాలుగు ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా గుణపాఠం నేర్చుకోలేదని ధ్వజమెత్తారు.

# నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

**మొదటిపేజీ తరువాయి**

వారీ సమీక్షా సమావేశాలు నిర్వహించిన క్రమంలో జరుగుతున్న ఈ 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ ప్రాధాన్యత సంతరించుకుంది. పరిపాలనలో ప్రభుత్వ సమర్థతను మరింత మెరుగుపరిచేలా దిశానిర్దేశం చేయడం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు పురోగతిని సమీక్షించడం లక్ష్యంగా రెండు రోజుల కలెక్టర్ల సదస్సు ఉండనుంది. నాలుగు జిల్లాలకు చెందిన కలెక్టర్లు.. తాము ఆచరించిన బెస్ట్ ప్రాక్టీసును తొలిరోజు ప్రెజెంట్ చేయనున్నారు. రెండోరోజు సంజీవని, సమ్మర్ యాక్షన్ ప్లాన్, సూపర్ సిక్స్, సంక్షేమం, రెవెన్యూ వంటి వాటిపై సిఎం సమీక్షించనున్నారు. ఈ రెండు రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకూ రెండు రోజులపాటు ఈ సదస్సు జరగనుంది.

# ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేస్తూ.. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని 51 మంది వైద్యులను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు ప్రకటించారు. శాశ్వత ఉద్వాసనకు గురైన 51 మందిలో బోధనాసుపత్రులకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లు 8 మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 41 మంది, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారు. వీరితో పాటు మరో ముగ్గురు ప్రొఫెసర్లపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలగించిన వారిలో కొందరు ఏడేళ్ల నుంచి, మరికొందరు ఆరేళ్ల నుంచి విధులకు దూరంగా ఉంటూ సొంత వ్యాపకాలు సాగిస్తున్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్-1964 ప్రకారం ఏడాదికి మించి విధులకు గైర్హాజరైతే రాజీనామా చేసినట్లుగానే పరిగణించే అధికారం ప్రభుత్వానికి ఉంది. నిబంధనల మేరకు వీరికి ముందస్తుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ ఇవ్వడానికి తగిన సమయం ఇచ్చినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఏడాదిలోపు గైర్హాజరీలో ఉన్న మరో 33 మంది వైద్యులు ఇందులో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఛార్జిమెమోలు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా విధుల్లో చేరని పక్షంలో వీరిని కూడా విధుల నుంచి తొలగించనున్నట్లు హెచ్చరించారు. ప్రభుత్వ హెచ్చరికలతో ఇప్పటికే 11 మంది వైద్యులు తిరిగి విధుల్లో చేరారు. వైద్యుల బాధ్యతారాహిత్యాన్ని ఏమాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. . త్వరలోనే మరో ముగ్గురు ప్రొఫెసర్లపై కూడా ఇటువంటి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. విధులకు గైర్హాజరైన వారిలో కాకుండా, మరో 33 మంది వైద్యులకు ప్రభుత్వం ఛార్జిమెమోలు జారీ చేసింది. వైద్య సేవలకు ఎటువంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను నిలిపివేసిన ట్రంప్

**మే 06 (రిపబ్లిక్ న్యూస్):**

ఇరాన్‌తో చర్చల్లో పురోగతి సాధించామని, పాకిస్థాన్ వంటి దేశాల అభ్యర్థన మేరకు కీలక నిర్ణయం తీసుకున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. హర్మూజ్ జలసంధిలో అమెరికా నేతృత్వంలో చేపట్టిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆయన బుధవారం ప్రకటించారు. అయితే, ఇరాన్‌పై విధించిన దిగ్బంధనం మాత్రం పూర్తిస్థాయిలో కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ మేరకు ట్రంప్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. "ఇరాన్‌తో తుది ఒప్పందం దిశగా గణనీయమైన పురోగతి సాధించాం. పాకిస్థాన్, ఇతర దేశాల అభ్యర్థన మేరకు 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' కింద నౌకల కదలికలను కొంతకాలం నిలిపివేయాలని నిర్ణయించాం. ఒప్పందం ఖరారవుతుందో లేదో చూసేందుకే ఈ విరామం" అని ఆయన పేర్కొన్నారు.అంతకుముందు వైట్‌హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్, ఇటీవలి సైనిక చర్యల్లో ఇరాన్ నావికా, వైమానిక దళాలు పూర్తిగా దెబ్బతిన్నాయని వ్యాఖ్యానించారు. వారి సైనిక శక్తిని సర్వనాశనం చేశామని, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోందని, అందుకే ఇరాన్ ఒప్పందం కోసం ముందుకు వస్తోందని ఆయన అన్నారు. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హర్మూజ్ జలసంధి తమ నియంత్రణలోనే ఉందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా స్పష్టం చేశారు. ఇరాన్‌తో చర్చల ఫలితం వెలువడేంత వరకు ఈ తాత్కాలిక విరామం కొనసాగనుంది.

# 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

**మొదటిపేజీ తరువాయి**

కార్యక్రమం జరుగుతుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య బుధవారం కోల్‌కతాలో ప్రకటించారు. ఉదయం10 గంటలకు మహానగరంలోని ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

గురువారం సాయంత్రం కోల్‌కతాలో శాసనసభా పక్ష సమావేశం జరుగుతుందని సమిక్ భట్టాచార్య

తెలిపారు. ఈ సమావేశంలో శాసనసభా పక్ష నేతను పార్టీ ఎమ్మెల్యేలు అంతా కలిసి ఎన్నుకుంటారని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్రం మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయే నాయకులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవుతారని పార్టీ నేతలు చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా కొలువుదీరనున్న మంత్రి వర్గంలో దాదాపు 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర నాయకత్వం చెబుతుంది. మరోవైపు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇప్పటికే దృష్టి కేంద్రీకరించారు.

# భారీ పెట్టుబడులకు 17వ ఎస్ఐపీబీ ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

ఒక పెట్టుబడి, పరిశ్రమ రాష్ట్రానికి వచ్చే విషయంలో అనుమతుల నుంచి శంకుస్థాపన, ప్రారంభోత్సవం వరకు నిర్దేశిత గడువులోగా జరిగేలా చూడాలన్నారు. ఒప్పందం చేసుకున్న కంపెనీల శంకుస్థాపన నుంచి ఉత్పత్తి వరకూ నిర్దిష్టమైన కాలపరిమితిలో జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

ప్రభుత్వపరంగా ఇవ్వాల్సిన అనుమతుల విషయంలో ఒక్క రోజు కూడా జాప్యం జరగకూడదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అనుమతుల జారీ విషయంలో ఏపీ బ్రాండ్ సృష్టించాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పెట్టుబడులను ఆకర్షించాలంటే ఇతరుల కంటే మనం ఎలా భిన్నమో ఏపీలో అనుమతులు ఎంత సులభతరమో వారికి చెప్పాలని స్పష్టం చేశారు. ఏపీలో ప్రాజెక్టులు రావాలన్న తపన ఉన్న అధికారులను అనుమతులు ఇచ్చే స్థానాల్లో నియమించాలని సూచించారు.

**వన్ ఫ్యామిలీ - వన్ ఎంట్రప్రెన్యూర్‌లో ఎంఎస్ఎంఈలు కీలకం**

సచివాలయంలో జరిగిన 17వ ఎస్ఐపీబీ సమావేశంలో 25 ప్రాజెక్టులకు చెందిన రూ.2,01,023 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 39,067 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "పెట్టుబడుల విషయంలో భారీ పరిశ్రమలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో ఎంఎస్ఎంఈలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్ విషయంలో ఎంఎస్ఎంఈలు కీలక పాత్ర పోషిస్తాయి. అన్ని పారిశ్రామిక ప్రాంతాలకు గ్యాస్ పైప్ లైన్ అందుబాటులో ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఫుడ్ ప్రాసెసింగ్ లో రంగంలో రాష్ట్రంలో అపార అవకాశాలు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుని పెట్టుబడులు గ్రౌండ్ అయ్యేలా చూడాలి. మన రాష్ట్రంలో ఉద్యాన, వాణిజ్య పంట ఉత్పత్తులకు విలువ జోడింపు జరగాలి. ఆయిల్ పాం, మామిడి, కొబ్బరి, కోకో సహా పలు పంటలకు వ్యాల్యూ అడిషన్ ఇస్తే రైతులకు ఎంతో మంచి జరుగుతుంది" అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, మంత్రులు టీజీ భరత్, అచ్చెన్నాయుడు, సుభాష్, వివిధ శాఖల అధికారులు, వర్చువల్‌గా మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.

**17వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ప్రతిపాదనల వివరాలు**

ఇంధన రంగం

1. రిలయన్స్ ఇండస్ట్రీస్ - శ్రీసత్యసాయి జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టు రూ.51,300 కోట్ల పెట్టుబడులు, 20 వేల మందికి ఉద్యోగాలు
2. క్లీన్ రెన్యూబుల్ ఎనర్జీ హైబ్రీడ్ త్రీ లిమిటెడ్, నంద్యాలలో రూ.155 కోట్ల పెట్టుబడులు, 40 మందికి ఉద్యోగాలు
3. క్లీన్ ఎనర్జీ హైబ్రీడ్ ట్వెల్వ్ లిమిటెడ్ అనంతపురం జిల్లా రూ.779 కోట్ల పెట్టుబడులు, 125 మందికి ఉద్యోగాలు
4. క్లీన్ ఎనర్జీ హైబ్రీడ్ థర్టీన్ లిమిటెడ్ అనంతపురం జిల్లా రూ.779 కోట్ల పెట్టుబడులు 125 మందికి ఉద్యోగాలు
5. అదాని హైడ్రో ఎనర్జీ ఎలెవెన్ కడప జిల్లాలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ రూ. 12,297 కోట్ల పెట్టుబడులు, 3375 మందికి ఉద్యోగాలు
6. యమాన్కో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తిరుపతి జిల్లాలో గ్రీన్ హైడ్రోజన్ రూ.9398 కోట్ల పెట్టుబడులు, 5820 మందికి ఉద్యోగాలు
7. అమృత శ్రీ బయో సీఎన్జీ లిమిటెడ్ విజయనగరం రూ.89 కోట్ల పెట్టుబడులు, 402 మందికి ఉద్యోగాలు
8. బాలాజీ బయోఎనర్జీ ఆర్గానిక్స్, నెల్లూరు జిల్లా రూ.59 కోట్ల పెట్టుబడులు, 335 మందికి ఉద్యోగాలు
9. హెచ్ పీసీఎల్ రెన్యూబుల్ గ్రీన్ ఎనర్జీ, ఏలూరు జిల్లా రూ.100 కోట్ల పెట్టుబడులు, 150 మందికి ఉద్యోగాలు
10. ఎనర్జియా బయో ఫ్యూయల్స్ తిరుపతి జిల్లాలో సీబీజీ ప్లాంట్ రూ.59 కోట్ల పెట్టుబడులు, 335 మందికి ఉద్యోగాలు
11. విభా బయో ఫ్యూయల్స్ తూర్పుగోదావరి జిల్లా రూ.67 కోట్ల పెట్టుబడులు, 110 మందికి ఉద్యోగాలు
12. ఐఓసీ జీపీఎస్ రెన్యువబుల్స్ ఎన్టీఆర్ జిల్లాలో సీబీజీ ప్లాంట్ రూ.120 కోట్లు పెట్టుబడులు, 200 మందికి ఉద్యోగాలు,
13. డెల్టా బయోగ్యాస్ పలనాడు జిల్లా రూ. 100 కోట్లు పెట్టుబడులు, 750 మందికి ఉద్యోగాలు

ఐటీ

14. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ విశాఖలో డేటాసెంటర్ ఏర్పాటు రూ.1,08,010 కోట్ల పెట్టుబడి, 1000 మందికి ఉద్యోగాలు
15. క్యారియర్ ఎయిర్ కండిషనింగ్, తిరుపతి జిల్లాలో బల్క్ చిల్లర్స్ తయారీ రూ.863 కోట్ల పెట్టుబడులు, 721 మందికి ఉద్యోగాలు.
16. ఎన్ఎస్టీఎల్ డీఆర్డీఓ, అమరావతి క్వాంటం వ్యాలీ రూ.22.5 కోట్ల పెట్టుబడి, 20 మందికి ఉద్యోగాలు

ఫుడ్ ప్రాసెసింగ్

17. స్నేహా ఫార్మ్స్ లిమిటెడ్ అనంతపురం, అన్నమయ్య జిల్లాలు, రూ,277.94 కోట్ల పెట్టుబడులు, 435 మందికి ఉద్యోగాలు

పరిశ్రమలు

18. గ్రైడోన్ ఎనర్జీ లిమిటెడ్, కర్నూలు జిల్లా, రూ.3149 కోట్ల పెట్టుబడులు, 320 ఉద్యోగాలు
19. అపోలో టైర్స్ , తిరుపతి జిల్లా, శ్రీసిటీ రూ,6100 కోట్లు పెట్టుబడులు, 1000 మందికి ఉద్యోగాలు
20. ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్, ఫ్రాగ్రెన్సెస్ ఇఫ్కో సెజ్ నెల్లూరు, రూ.3153 కోట్ల పెట్టుబడులు, 172 మందికి ఉద్యోగాలు
21. రాయల్ ఎన్ ఫీల్డ్ , తిరుపతి జిల్లా, రూ.2508 కోట్ల పెట్టుబడులు, 3 వేల మందికి ఉద్యోగాలు
22. చెట్టినాడ్ సిమెంట్స్ , పలనాడు జిల్లా, రూ.1340 కోట్లు పెట్టుబడులు, 360 మందికి ఉద్యోగాలు
23. ఏఏకె సౌత్ ఈస్ట్ ఇండియా కాకినాడ జిల్లా, రూ.171.52 కోట్ల పెట్టుబడులు, 102 మందికి ఉద్యోగాలు
24. ఐటీసీ లిమిటెడ్, గుంటూరు జిల్లా రూ.51.65 కోట్ల పెట్టుబడులు, 50 మందికి ఉద్యోగాలు
25. హ్యాంగ్యో ఐస్ క్రీమ్స్ తిరుపతి జిల్లా రూ.74.49 కోట్ల పెట్టుబడులు, 110 మందికి ఉద్యోగాలు.

# గోవిందం పల్లి గ్రామంలో కలుషిత నీరు -సిపిఐ ఆందోళన





**ఓబులవారిపల్లి మే 6 రిపబ్లిక్ న్యూస్.**

ఓబులవారిపల్లి మండలం గోవిందంపల్లి పంచాయతీలోని గోవిందం పల్లి గ్రామంలో త్రాగునీరు కలుషితమై ప్రజలకు తీవ్ర అనారోగ్యాలు కలిగిస్తున్నాయి,కలుషిత నీటి సమస్య తీవ్రమవుతోందని, వెంటనే పరిష్కారం చేయకపోతే ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ మంగళవారం హెచ్చరించింది.

గోవిందంపల్లె పంచాయతీలో డ్రైనేజీ నీటి సమస్యను సీపీఐ మండల కార్యదర్శి చింతలపూరి నాగమ్మ ఆధ్వర్యంలో పరిశీలించారు. అనంతరం ఏపీఎండీసీ సీపీఓకి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ, గ్రామ ప్రజలు ఇప్పటికే దుమ్ము కాలుష్యం కారణంగా జలుబు, శ్వాసకోశ సమస్యలు వంటి అనారోగ్యాలతో బాధపడుతున్నారని తెలిపారు. ఇప్పుడు మంగంపేట ప్రాంతం నుంచి వచ్చే డ్రైనేజీ నీరు గోవిందమ్మ చెరువులో కలవడం వల్ల పరిస్థితి మరింత విషమించిందన్నారు.చెరువులో కలుషిత నీరు చేరడం వల్ల భూగర్భ జలాలు కూడా ప్రభావితమై, తాగునీరు కలుషితమవుతోందని, దీంతో కొత్త కొత్త వ్యాధులు వస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నప్పటికీ, ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటివరకు పట్టించుకోలేదని విమర్శించారు.

మంగంపేట పునరావాస కాలనీ నుంచి వచ్చే డ్రైనేజీ నీటిని పూర్తిగా నిలిపివేసి, శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ఏపీఎండీసీ సీపీఓ, సమస్యను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అయితే, హామీ అమలు కాకపోతే గ్రామ ప్రజలతో కలిసి ఏపీఎండీసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఐ నేతలు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు హటారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్.

**ఓబులవారిపల్లి మే 6 రిపబ్లిక్ న్యూస్.**



అకాలముగా కురిసిన గాలివాన కారణంగా దెబ్బతిన్న పంటలను రాష్ట్ర ప్రభుత్వ విప్ రైల్వే కోడూరు నియోజకవర్గం జనసేన పార్టీ శాసనసభ్యులు అరవ శ్రీధర్ మంగళవారం రైతులతో కలిసి పంట పొలాలకు వెళ్లి స్వయంగా పంటలను పరిశీలించారు, రైల్వే కోడూరు నియోజకవర్గంలోని చిట్వేలి మండలం మాలేమారాపురం గ్రామంలో దెబ్బతిన్న అరటి మొక్కజొన్న సజ్జ మామిడి పంటల రైతులను కలిసి పరామర్శించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులతో మాట్లాడుతూ ధైర్యంగ ఉండండి అనిచెప్పి అధికారులతో పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వము దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు,

ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు,

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు కూటమి నాయకులు, ఎన్ డి ఏ కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవనకొండలో రేపు మహిళా భద్రతపై అవగాహన సదస్సు కార్యక్రమం

**దేవనకొండ, మే 7( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**



దేవనకొండ గ్రామంలో మహిళల భద్రతపైఅవగాహన పెంపొందించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం గురువారం సొసైటీ ఫంక్షన్ హాల్లో జరగనుంది.మహిళలపై పెరుగుతున్న నేరాలు, దొంగతనాల నేపథ్యంలో జాగ్రత్తలు, భద్రతా చర్యలపై అవగాహన కల్పించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశంగా అధికారులు తెలిపారు. కార్యక్రమానికి కర్నూలు జిల్లా ఎస్పీ, పత్తికొండ డీఎస్పీ ముఖ్య అతిథులుగా హాజరై మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, స్వీయ భద్రతా మార్గాలపై వివరించనున్నారు.ఈ సందర్భంగా మహిళలు ఎదుర్కొనే సమస్యలు, ఫిర్యాదుల పరిష్కార విధానం, పోలీస్ సహాయం పొందే మార్గాలపై కూడా చర్చించబడుతుంది.ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆధునిక సాంకేతిక వనరుల వినియోగంపై మార్గదర్శకాలు అందించనున్నారు.మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐ వేణుగోపాల్ కోరారు.

# నేటి నుండి ఎల్ఆర్ఎస్ మేళా ప్రారంభం

### కర్నూలు నగరపాలక సంస్థ ప్రత్యేక ఏర్పాటు

**రెండు రోజుల పాటు కౌన్సిల్ హాల్లో నిర్వహణ వెంటనే అప్రూవల్స్‌కు అవకాశం**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 6)**



అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం అమలులో ఉన్న లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) ప్రక్రియను వేగవంతం చేయడానికి కర్నూలు నగరపాలక సంస్థ ప్రత్యేకంగా "ఎల్ఆర్ఎస్ మేళా"ను నిర్వహిస్తోంది. ఈ విషయాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు వెల్లడించారు.ఇప్పటికే ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకుని ఫీ ఇంటిమేషన్ పొందిన వారు ఫీజు చెల్లించిన వెంటనే అప్రూవల్ ప్రొసీడింగ్స్ పొందవచ్చని తెలిపారు. అలాగే షార్ట్‌ఫాల్ ఉన్న దరఖాస్తుదారులు అవసరమైన పత్రాలు సమర్పించి ఫీజు చెల్లిస్తే వెంటనే అప్రూవల్ పొందే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ మేళాలో పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు, ఎల్‌టిపిలు పాల్గొని దరఖాస్తుదారులకు సహాయం అందించనున్నారు.ఈ మేళా గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటుఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీ, నగరపాలక సమావేశ భవనంఉదయం 9:00 నుంచి సాయంత్రం 6:00 వరకు నిర్వహించబడుతుంది.ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

## ప్రతిభా పురస్కారం, ఉపకార వేతనాలకు దరఖాస్తులు



**ఎమ్మిగనూరు, మే, 6(రిపబ్లిక్ న్యూస్ )** ఆర్యవైశ్య సంఘంకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి.. రాకేష్ పిలుపు మేరకు 10వ తరగతి పరీక్షల్లో 570 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు.. ప్రతిభా పురస్కారలు మరియు స్కాలర్ షిప్స్ అందజేయాలని అందుకు ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు ప్రతాప్ శ్రీకాంత్ బుధవారం తెలిపారు. అందుకు గానుగూగుల్ ఫారం ద్వారా విద్యార్థులు నమోదు చేసుకోవాలని కోరారు . ఈ నెల 17 వ తేదీ లోపు ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి.. దేవకి వెంకటేష్, గౌరవ అధ్యక్షులు, టౌన్ బ్యాంక్ చైర్మన్ ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, టౌన్ బ్యాంక్ డైరెక్టర్, ఆర్యవైశ్య మీడియా ప్రముఖ్,, వెంకట గిరి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# పదో తరగతి అర్హతతో డిప్లొమా అవకాశం

## సిపెట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**మే 6( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**



టెక్నికల్ రంగంలో స్థిరపడాలనుకునే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇన్స్టిట్యూట్ అఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) కీలక అవకాశం కల్పిస్తోంది. విజయవాడ కేంద్రంలో 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది.

సంస్థ అందిస్తున్న కోర్సుల్లో డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ ) ఉన్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశాలు జూన్ 7న నిర్వహించనున్న క్యాట్ (సిపెట్ అడ్మిషన్ టెస్ట్ ) ద్వారా జరుగుతాయి. విజయవాడ కేంద్రంలో మొత్తం 120 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత గల విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ సౌకర్యం కల్పిస్తామని సంస్థ డైరెక్టర్ డా. సిహెచ్. శేఖర్ తెలిపారు. ఇది ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది.

ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీల్లో జూనియర్ ఇంజనీర్లు, క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్లు, మౌల్డ్ డిజైనర్లుగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అధికారులు తెలిపారు. ప్రారంభ వేతనం నెలకు రూ.18,000 నుంచి రూ.25,000 వరకు ఉండవచ్చని పేర్కొన్నారు. విదేశీ ఉద్యోగ అవకాశాలకు కూడా ఈ కోర్సులు మంచి మార్గమని వెల్లడించారు.

ఆసక్తి గల విద్యార్థులు మే 28, 2026 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు అధికారిక వెబ్‌సైట్ సిపెట్ 26.ఆన్లైనరేరిజిస్ట్రేషన్ఫర్మ్ .ఆర్గనైజషన్ /సిపెట్ / ను సందర్శించవచ్చు లేదా 7893586494 నంబర్‌ను సంప్రదించవచ్చు.

గమనిక: పదో తరగతి అనంతరం టెక్నికల్ విద్య ద్వారా త్వరగా ఉద్యోగ అవకాశాలు పొందాలనుకునే విద్యార్థులకు ఇది మంచి అవకాశం.

# విజయ్ కు షాక్ ఇవ్వబోతున్న డీఎంకే అన్నాడీఎంకే.?

**- ప్రభుత్వ ఏర్పాటు దిశగా ఇరు పార్టీల చర్చలు. -అధికారమే అంతిమంగా ఇరు పార్టీల వ్యూహాలు.**

**- సంఖ్యా బలం లేదని విజయ్ సీఎం ప్రమాణ స్వీకారం రద్దు.**

**అమరావతి మే 06 (రిపబ్లిక్ న్యూస్):**



తమిళనాడు రాజకీయాలు ఒక అంతుచిక్కని మలుపు తిరిగాయి. దశాబ్దాలుగా బద్ధశత్రువులుగా ఉన్న డీఎంకే మరియు అన్నాడీఎంకే లు చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాయనే వార్త దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.ముఖ్యంగా తమిళ సూపర్ స్టార్ విజయ్ స్థాపించిన టీవీకే పార్టీని అధికారానికి దూరంగా ఉంచడమే లక్ష్యంగా ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. తమిళనాడులో మారుతున్న పరిణామాల ప్రకారం, డీఎంకే మరియు అన్నాడీఎంకే తమ విభేదాలను పక్కన పెట్టి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ రెండు పార్టీల ఎమ్మెల్యేలతో పాటు, వారి మద్దతుదారుల సీట్లను కలిపితే మొత్తం సంఖ్యాబలం 121కి చేరుతుంది. ఇది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ కంటే ఎక్కువ. అయితే, ఈ కూటమిలో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనే దానిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. ప్రస్తుత ఎన్నికల్లో స్టాలిన్ ఓటమి పాలవడంతో, అనుభవం ఉన్న నాయకుడిగా ఎడప్పాడి పళనిస్వామి మరోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

**విజయ్ విజయానికి అడ్డుకట్ట వేసే వ్యూహం**

తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్‌కు మేజిక్ ఫిగర్ సాధించే అవకాశం ఇవ్వకుండా, సంప్రదాయ ద్రవిడ పార్టీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. విజయ్ వంటి కొత్త శక్తి అధికారంలోకి వస్తే రెండు ప్రధాన పార్టీల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని భావించిన అగ్రనేతలు, ఈ మేరకు ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ఈ వింత పొత్తు గనుక నిజమైతే, తమిళనాడు రాజకీయ చరిత్రలో ఇది ఒక అరుదైన మరియు ఊహించని అధ్యాయంగా మిగిలిపోతుంది.

**ఇది సాధ్యమేనా?**

అయితే, ఈ ప్రచారాన్ని కొందరు రాజకీయ విశ్లేషకులు కొట్టిపారేస్తున్నారు. పరస్పర విరుద్ధ ధ్రువాలైన డీఎంకే మరియు అన్నాడీఎంకేలు కలవడం అనేది సిద్ధాంతపరంగా దాదాపు అసాధ్యమని వారు వాదిస్తున్నారు. ఒకవేళ కేవలం అధికారం కోసమే కలిసినా, క్షేత్రస్థాయిలో ఉన్న కార్యకర్తలు దీనిని అంగీకరించడం కష్టమని, ఇది పార్టీల మనుగడకే ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. ఏదేమైనా, తమిళనాట ప్రస్తుత పరిస్థితులు రోజుకో మలుపు తిరుగుతుండటంతో, అంతిమంగా ముఖ్యమంత్రి పీఠం ఎవరిని వరిస్తుందనేది ఇప్పుడే చెప్పలేమని, మరికొద్ది రోజులు వేచి చూడాలని వారు అభిప్రాయపడుతున్నారు. తమిళనాడు రాజకీయ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అత్యంత నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. దశాబ్దాలుగా ఎప్పుడూ శత్రువులగా ఉండే డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు తమ బద్ధ వైరాగ్యాన్ని పక్కన పెట్టి పొత్తు దిశగా అడుగులు వేస్తున్నాయనే వార్త ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది.తలపతి విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కజగం' పార్టీని అధికార పీఠానికి దూరంగా ఉంచడమే ఏకైక లక్ష్యంగా ఈ రెండు ద్రవిడ పార్టీల మధ్య చర్చలు సాగుతున్నట్లు 'ఇండియా టుడే' తన కథనంలో వెల్లడించింది. ప్రస్తుత అసెంబ్లీలో మేజిక్ ఫిగర్ 118 కాగా, విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 107 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ తన 5 మంది ఎమ్మెల్యేల మద్దతును విజయ్‌కు ప్రకటించడంతో ఆయన బలం 112కి చేరింది. అయితే మెజారిటీకి ఇంకా ఆరుగురు ఎమ్మెల్యేల మద్దతు విజయ్‌కు అనివార్యంగా మారింది. ఈ పరిస్థితుల్లో విజయ్ బలాన్ని నిరూపించుకోకముందే.. 59 స్థానాలు గెలిచిన డీఎంకే, 47 స్థానాలు గెలిచిన అన్నాడీఎంకే కలిసి ప్రభుత్వ ఏర్పాటుపై మంతనాలు జరపడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది.

వ్యూహాత్మకంగా ఈ రెండు పార్టీలు కలిస్తే వారి సంఖ్యాబలం 106కి చేరుతుంది. అయితే స్వతంత్రులు, చిన్న పార్టీలు లేదా లెఫ్ట్ పార్టీలను కలుపుకుని విజయ్‌కు చెక్ పెట్టాలని ద్రవిడ నేతలు భావిస్తున్నట్లు సమాచారం. దశాబ్దాలుగా సిద్ధాంతపరంగా, వ్యక్తిగతంగా తలపడ్డ ఈ పార్టీలు.. విజయ్ రూపంలో ఒక కొత్త శక్తి ఉద్భవించడాన్ని తమ ఉనికికే ప్రమాదంగా భావిస్తున్నాయి. ఒకప్పుడు ఒకే చెట్టు నుంచి పుట్టిన ఈ రెండు పార్టీలు ఇప్పుడు మళ్ళీ అధికారం కోసం ఏకమవుతాయా అన్నది ఉత్కంఠ రేపుతోంది.

# బడి పిలుస్తుంది కార్యక్రమంతో విద్యార్థుల చేరికలకు ఊతం

**అవగాహన ర్యాలీలు, అంగన్వాడీ సందర్శనలతో చేర్పుల ప్రోత్సాహం**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 6)**
విద్యార్థుల చేరికలను పెంపొందించేందుకు నిర్వహిస్తున్న "బడి పిలుస్తుంది" కార్యక్రమం కర్నూలు నగరంలోని సి. క్యాంప్ పరిధిలో ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీరామ్ నగర్, రైతు బజార్ ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.




ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారులు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి, అర్హత కలిగిన చిన్నారులను ఒకటవ తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. సుధాకర్ మాట్లాడుతూ, బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలో చేరాలని, ఐదు సంవత్సరాలు పూర్తిచేసిన ప్రతి బాలబాలిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా మాట్లాడి, పిల్లల చేరికలను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు చౌడయ్య, రెహమాన్, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ రఫీ, ఐసిడిఎస్ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పసుపుల గ్రామపంచాయతీకి ఐఎస్ఓ సర్టిఫికేషన్

**ఉమ్మడి కర్నూలు జిల్లాలో తొలి ఘనత -రాష్ట్రంలో 18వ ఐఎస్ఓ గ్రామపంచాయతీగా పసుపుల -సమర్థ పాలనకు గుర్తింపు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 6)**
పసుపుల గ్రామపంచాయతీ విశిష్ట ఘనత సాధించింది. కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఆదేశాలతో, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐఎస్ఓ సర్టిఫికేషన్ ప్రక్రియలో పసుపుల గ్రామపంచాయతీ ఎంపికై, ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ గుర్తింపు పొందిన తొలి గ్రామపంచాయతీగా నిలిచింది. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి రెండు చొప్పున మొత్తం 52 గ్రామపంచాయతీలను ఐఎస్ఓ సర్టిఫికేషన్ కోసం ఎంపిక చేయగా, తొలి విడతలో 24 పంచాయతీలకు ఈ ప్రక్రియ పూర్తిచేయబడింది. ఈ క్రమంలో పసుపుల గ్రామపంచాయతీ రాష్ట్రంలోని 13,326 గ్రామపంచాయతీలలో ఐఎస్ఓ సర్టిఫికేట్ పొందిన 18వ పంచాయతీగా నిలిచి ప్రత్యేక గుర్తింపు సాధించింది.

గ్రామపంచాయతీ అందిస్తున్న సేవల నాణ్యత, సమయపాలన, పారదర్శక పాలన, సమర్థవంతమైన నిర్వహణతో పాటు అమలు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమాలు ఐఎస్ఓ ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో ఈ గౌరవం దక్కింది. సర్టిఫికేషన్ ప్రక్రియలో టి క్యూ ఎస్ సంస్థ నుంచి సీఎం ప్రేమానంద్ ఆడిటర్గా వ్యవహరించగా, పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి ఇమామ్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పసుపుల గ్రామపంచాయతీ సేవలను ప్రశంసించారు. తమ స్వగ్రామం ఈ స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమని, ఉమ్మడి జిల్లాలో తొలి ఐఎస్ఓ గ్రామపంచాయతీగా నిలవడం ఆనందదాయకమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర్, ఎంపీడీవో, మాజీ సర్పంచ్ బొగ్గుల శీలమ్మ, ప్రత్యేక అధికారి జి. రఘునాథ్, రిటైర్డ్ డిప్యూటీ ఎంపీడీవో వి. జేమ్స్ కృపావరం, పంచాయతీ అభివృద్ధి అధికారి వై. హేమంత్ కుమార్ రెడ్డి మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సిఐటియు ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల కమిటీ ఎన్నిక,





**ఓబులవారిపల్లి మే 6 రిపబ్లిక్ న్యూస్**
ఓబులవారిపల్లె మండలంలోని వై కోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు ఓబులవారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశ వర్కర్ల యూనియన్ నూతన కమిటీలను మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగినది, సిఐటియు అనుబంధ సంస్థ అయిన ఆశా వర్కర్స్ యూనియన్ వై కోట, పీహెచ్ సిలో, నూతన కమిటీ ఎన్నుకున్నట్లు సిఐటియు, ఓబులవారిపల్లి మండల కన్వీనర్, నాగిపోగు పెంచలయ్య తెలిపారు, వై కోట పి హెచ్ సి కన్వీనర్ గా మేకల సుబ్బరత్న, కో కన్వీనర్ గా, ఎం చెంగమ్మ, కమిటీ సభ్యులుగా, పి శాంతమ్మ, పి శకుంతల, జె. పార్వతి, ఎం మంజుల, కే రెడ్డమ్మ, టీ కళావతి, డి కిరణ్ కుమారి, పి వెంకట సుబ్బమ్మలను ఎన్నుకోవడం జరిగినది, అలాగే ఓబులవారిపల్లి పీ హెచ్ సిలో, కన్వీనర్ గా ఏ.సరిత, కో కన్వీనర్ గా, ఎన్, వెంకటలక్ష్మి, సభ్యులుగా, ఎం మస్తానమ్మ ఎం గంగాదేవి, పి వేములమ్మ పి సరోజ, జె.రెడ్డి ప్రసన్న, కే లత, ఆర్ చెంగమ్మ,లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది, ఈ కార్యక్రమానికి, సిఐటియు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, సిహెచ్ చంద్రశేఖర్, ఏపీఎండీసీ, పోరాట యూనియన్, జేఏసీ కన్వీనర్, ఆర్ వెంకటేష్. కోడూరు అంగనవాడి ప్రాజెక్టు, అధ్యక్ష ,కార్యదర్శులు, ఎన్ .రమాదేవి, ఎస్ శ్రీలక్ష్మి, బిల్డింగ్ వర్కర్స్, నాయకులు, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ఏడు సంవత్సరాలుగా, వేతనాలు పెంచలేదన్నారు. ధరలు ఆకాశానట్టుతున్నాయని, ధరలకు అనుగుణంగా,కనీస వేతనం, 26000 వేల రూపాయలకు పెంచాలని, పేరుకు గౌరవ వేతనం పేరుతో పని భారం మాత్రం పెంచారన్నారు, పెంచిన పని భారం తగ్గించాలని, అంగనవాడి వర్కర్స్ మాదిరిగానే ఆశ వర్కర్స్ కి సెలవులు ఇవ్వాలని వారు కోరారు. కాళీ పోస్టులు భర్తీ చేయాలని, నాణ్యమైన యూనిఫారం , మొబైల్ ఫోన్స్,ఇవ్వాలని, ఏఎన్ఎం, జిఎన్ఎమ్, పర్మినెంట్ పోస్టులకు, ప్రాధాన్యత ఇవ్వాలని, ఖర్చులు ఇవ్వాలని,కోరారు. ఈపిఎఫ్, గ్రాడ్యుటి, 10 లక్షలు ఇన్సూరెన్స్, అమలు చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం, అంగన్వాడీల పోరాట స్ఫూర్తితో, ఆశా వర్కర్స్ ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని సిఐటియు ఆశా వర్కర్స్ యూనియన్ కు పిలుపునిచ్చారు.

# 1లక్షా 51వేల కోట్లతో భారీ పరిశ్రమలు ఏర్పాటు

**వైసీపీ ప్రభుత్వం వల్లే రాష్ట్రంలో భూ సమస్యలు - కూటమిలో నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ**

**పంపిణీ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, -మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**





**శ్రీ సత్యసాయి,అమడగూరు, మే 06,(రిపబ్లిక్ న్యూస్):**
పుట్టపర్తి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. అమడగూరు మండలంలోనీ పూలకుంట్లపల్లి ,ఈడిగవారిపల్లి లో బుధవారం రెవిన్యూ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా 526 మంది రైతులకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేశారు.

**మే 15 న ఏరోనాటికల్ పరిశ్రమకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు రూ.1 లక్షా 51వేల కోట్ల పెట్టుబడులతో భారీ పరిశ్రమలను స్థాపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. అందులో భాగంగా మే 15న పుట్టపర్తిలో రూ.1 లక్ష కోట్లతో ఏరోనాటికల్ పరిశ్రమకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన జరగనుందని తెలిపారు. అదేవిధంగా అమడగూరు మండలంలో సుమారు 33 వేల ఎకరాల్లో 5వేల మెగా వాట్ల సామర్థ్యం తో రూ.51 వేల కోట్లతో సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఓడి చెరువు, నల్లమాడ ప్రాంతాల్లో మరో 23 వేల ఎకరాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పరిశ్రమల ద్వారా దాదాపు 40 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో అమలు చేసిన విధానాల వల్ల భూ సమస్యలు పెరిగాయని విమర్శించారు. రైతుల భూములపై హక్కులు తగ్గేలా చేసిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. భూ సమస్యలు లేకుండా రైతులకు భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**193 చెరువులు,2 రిజర్వాయర్లను కృష్ణా జలాలతో నింపుతాం**

కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి సమానంగా అమలు అవుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో 26 కోట్లతో సిసి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు అదే విధంగా మరో 35 కోట్లతో తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 22 మాసాల్లోనే సుమారు 85 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గంలో చేపట్టినట్లు తెలిపారు. ఆమడగూరు మండలంలో జెకె పల్లి పంచాయతీలో కందుకూరుపల్లికి వెళ్లే రహదారుల నిర్మాణానికి 1కోటి 14 లక్షలు, పూలకుంట్లపల్లి పంచాయతీలో మద్దేమ్మగుడిపల్లి నుంచి దూదర గట్లపల్లికి రూ.36 లక్షలు, దిన్నేమీద కొత్తపల్లి కు రోడ్డు సౌకర్యం కల్పించామని తెలిపారు. ఇంకా రాబోయే మూడేళ్లలో పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులు, 2 రిజర్వాయర్లను కృష్ణా జలాలతో నింపుతామని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. అనంతరం పూలకుంటపల్లిలో 324 మంది రైతులకు ఈడిగవారిపల్లిలో 202 మంది రైతులకు రాజముద్ర కలిగిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సొసైటీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నంజప్ప , టీడీపీ యువ నాయకులు శ్యాం బాబు, చినగానీపల్లి వెంకటరెడ్డి, గోవిందు, రాజారెడ్డి , ప్రభాకర్ రెడ్డి , కుమార్ రెడ్డి రఘువీరారెడ్డి, రమణారెడ్డి, హనుమంతు రెడ్డి, రామచంద్రారెడ్డి ,శాంతమ్మ , రామానాయక్ , మండల తహసిల్దార్ మారుతి ప్రకాష్ ఎంపీడీవో లోకనాథ్ రెడ్డి , రెవిన్యూ అధికారులు ఇతర శాఖ అధికారులు ,రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

# బడి పిలుస్తుంది కార్యక్రమం విద్యార్థులకు అవగాహన

**మండల విద్యాశాఖ అధికారి జి ఓంకార్ యాదవ్**




**ఓర్వకల్లు ప్రతినిధి, మే 6(రిపబ్లిక్ న్యూస్)**
బుధవారం రోజున ఓర్వకల్లు గ్రామం నందు బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా 5 సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని గ్రామంలో ర్యాలీ మరియు మానవహారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు జీ ఓంకార్ యాదవ్ మరియు రాంభూపాల్ రెడ్డి , పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు, అంగన్వాడీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.



# కోతులబావి స్థలం మాదేనంటూ వచ్చారు !!??



**ఎమ్మిగనూరు, మే, 6,(రిపబ్లిక్ న్యూస్ )**పట్టణంలోని సర్వే నెంబర్ 321 లో గల శ్రీ కోతులబావి ఆంజనేయస్వామి గుడి, గుడి స్థలం తమదేనంటూ ఆదోనికి చెందిన గోవర్ధన దేశాయి స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ లో నోటిమాటగా ఫిర్యాదు చేయడం జరిగింది. గుడి మరియు గుడిస్థలం తమదేనని చెప్పుకోవడానికి తమ కుటుంబ సభ్యుల పై రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్ నెంబర్ 7285/2017 చూపిస్తున్నారు. ఈ డాక్యుమెంట్ అక్రమమని ఆధారాలతో నేను జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా అక్రమ రిజిస్ట్రేషన్ ను రద్దు పరచాలని జిల్లా కలెక్టర్ తెలిపినా స్థానిక సబ్ రిజిస్ట్రార్, మునిసిపల్ కమీషనర్ గత ఏడెనిమిది సంవత్సరాలుగా నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారు. మునిసిపల్ కమీషనర్ గంగిరెడ్డి గుడికి అడ్డంగా దానిపై జిల్లా కలెక్టర్ కమీషనర్ పై చర్యలు తీసుకోకపోవడం పై హిదువుల్లో బండలు పాతించడం తీవ్ర వ్యతిరేకత ఉంది. గుడి ముందు వున్న రోడ్ల పై డబ్బా షెడ్లు నిర్మించి కోట్లలో డబ్బు వసూలుకు అధికారులు, రాజకీయ నాయకులు సిద్ధపడడంవల్లనే గుడికి ద్రోహం చేస్తున్నారని ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చారు. కమీషనర్ గుడికి అడ్డంగా నిర్మించిన బండలు అక్రమమని... ఈ కారణంగానే పట్టణంలో హిందువుల్లో ఆశాంతి, అసహనం నెలకొన్నాయని ఉన్నతాధికారులకు తెలిసినా కమీషనర్ పై చర్యలు లేకపోవడం పై ప్రజల అసహనం ఆగ్రహంగా మారే అవకాశం వుంది. జిల్లా కలెక్టర్ తక్షణం కల్పించుకొని అక్రమ రిజిస్ట్రేషన్ ను రద్దు చేయిస్తూ గుడికి అడ్డంగా పెట్టిన బండ్లల ప్రహరీని తొలగించి కమీషనర్ గంగిరెడ్డిని బదిలీ చేయాలని కోరుతున్నాను. అధికారులు సహకరించకపోతే హిందూ సంఘాలు ఏకమై కార్యాచారణను ఏర్పాటు చేసుకొని బండల ప్రహరీని తొలగించడానికి సిద్ధపడాలి. ఇది చట్టబద్ధమేనని హిందువులు గ్రహించాలి. ప్రభుత్వ రికార్డుల ప్రకారం కోతుల బావి గుడి, గుడి స్థలం పై ఏ ఇతర వ్యక్తులకు హక్కులేదు.

# బేతంచెర్లలోరాయితీపై వ్యవసాయ పనిముట్ల కొరకు దరఖాస్తు చేసుకోండి

**- ఏ ఓ విజయ కుమార్ రెడ్డి**



**బేతంచెర్ల ప్రతినిధి , మే 6 (రిపబ్లిక్ న్యూస్)**
బేతంచెర్ల మండలం -వ్యవసాయ యాంత్రీకరణ లో భాగంగా రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు ఈ నెల 5 వ తేదీ నుండి 19 వ తేదీ వరకు రైతులు ంవవఎ .ap .gov .in /FM nqT website నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ట్రాక్టర్లు ,మినీ ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, బేలర్లు, టైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ దుక్కు, దమ్ము సెట్లు, రోటవేటర్లు, పవర్ వీడర్లు ,పవర్ టిల్లేర్లు, తదితర వ్యవసాయ పనిముట్లు రాయితీతో రైతులకు అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు. చిన్న, సన్న కారు రైతులు,మహిళా రైతులు, SC ,ST రైతులకు 50 శాతం సబ్సిడీతో మరియు ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీతో ూహీూవీ పధకం కింద వ్యవసాయ యాంత్రీకరణ అందించనున్నట్లు చెప్పారు. వ్యవసాయ భూమి కలిగి లేదా ROR భూమి కలిగిన రైతులు మాత్రమే అర్హులు. 2024-25 సంవత్సరానికి సబ్సిడీ పై వ్యవసాయ పరికరాలను పొందిన రైతు కుటుంబాలు అనర్హులు, దరఖాస్తు చేసుకున్న రైతులకు లాటరి పద్ధతి ద్వారా జాయింట్ కలెక్టర్ సమక్షంలో ఎంపిక చేస్తారు. ఆసక్తి గల రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసులోవాలని ఏవో కోరారు. మరింత సమాచారం కొరకు స్థానిక రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించవలసిందిగా మండల్ వ్యవసాయ అధికారి తెలిపారు.

## ప్రభుత్వ స్థలంలో టీడీపీ కార్యాలయం ఏర్పాటు ప్రయత్నం

# ఎస్వీ మోహన్ రెడ్డి ఆగ్రహం

**100 కోట్ల విలువైన ఆర్ & బి భూమిపై శంకుస్థాపన దారుణం**

**ప్రజా ఆస్తుల వినియోగంపై తీవ్ర విమర్శలు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 6)**
కర్నూలు నగరంలో ప్రభుత్వానికి చెందిన ఆర్ & బి అతిథి గృహ స్థలంలో టీడీపీ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నారంటూ వైఎస్ఆర్సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 100 కోట్ల విలువైన 2 ఎకరాల ప్రభుత్వ భూమిలో శంకుస్థాపన చేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు.
ఇప్పటికే టీడీపీకి కార్యాలయం ఉన్నప్పటికీ, మరో కార్యాలయం నిర్మించేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆ ప్రాంతంలో నివసిస్తున్న వారిని బలవంతంగా తరిమికొట్టి భూమి పూజ నిర్వహించడం అమానుషమని అన్నారు. ప్రభుత్వ భవనాలను కూల్చి పార్టీ కార్యాలయం నిర్మించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు.అలాగే వైఎస్ఆర్సీపీ కార్యాలయం నిర్మాణ సమయంలో టీడీపీ నాయకులు అడ్డంకులు సృష్టించారని, హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ 90 శాతం పూర్తైన కార్యాలయాన్ని అడ్డుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం ఆర్ & బి స్థలంలో షాపులు నిర్మించి అద్దెకు ఇవ్వాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.అదనంగా, ఆ స్థలంలో ఉన్న వందేళ్ల పురాతన వృక్షాలను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని, ఇది పర్యావరణానికి పెద్ద నష్టం కలిగిస్తుందని అన్నారు. ప్రజా ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వం వాటినే రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తోందని ఎస్వీ మోహన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.

# వన్ మంత్ వన్ విలేజ్ రైతు సదస్సు ను సద్వినియోగం చేసుకోండి,

## -తాసిల్దార్ యామిని రెడ్డి.



**ఓబులవారిపల్లి మే 6 రిపబ్లిక్ న్యూస్.**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన్ మంత్ వన్ విలేజ్ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఓబులవారిపల్లె మండల తాసిల్దార్ యామిని రెడ్డి మంగళవారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెల ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామానికి నెలలో నాలుగు సార్లు అనగా ప్రతి గురువారము రైతు సమస్యలపై సదస్సు నిర్వహించడం జరుగుతుందని రైతులు ఎలాంటి భూ సమస్యలు ఉన్నా సదస్సులో అధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని తాసిల్దార్ యామిని రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు, మే నెలలో పెద్దఓరం పాడు గ్రామంలో గురువారం నుండి ఈ సదస్సు సచివాలయంలో నిర్వహిస్తున్నామని రైతులు సమస్యలు ఉంటే సదస్సుకు హాజరై పరిష్కరించుకోవాలని అన్నారు, ఈ గ్రామంలో మే 7వ తారీకు గురువారం నుండి సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు, మండలంలో ప్రతినెల ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామములో ప్రతి బేస్తవారము ఈ సదస్సు నిర్వహించడం జరుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు ఈ కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి రాజేందర్, పంచాయతీరాజ్ ఏఈ మరియు నీటిపారుదల శాఖ ఏఈ మండల రెవెన్యూ అధికారులు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొంటారని రైతులకు ఇలాంటి రైతు సదస్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని,ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు.ద

# కర్నూలు జీజీహెచ్ ఓ.టి విభాగాల్లో సూపరింటెండెంట్ ఆకస్మిక తనిఖీ

**శస్త్రచికిత్సల నాణ్యత, రోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి**

**- ఇన్ఫెక్షన్ నియంత్రణలో రాజీ వద్దని ఆదేశాలు**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 6)**
కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)లో ఆపరేషన్ థియేటర్ (ఓ.టి) విభాగాల్లో సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలో జరుగుతున్న శస్త్రచికిత్సల విధానం, అందుబాటులో ఉన్న వైద్య సౌకర్యాలు, రోగుల భద్రతా ప్రమాణాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను స్వయంగా పలకరించి, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. (ఓ.టి) లో ఉన్న వైద్య పరికరాల పనితీరును తనిఖీ చేసి, అత్యాధునిక యంత్రాలను సమర్థవంతంగా వినియోగించాలని వైద్య సిబ్బందికి సూచించారు.ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లలో ఇన్ఫెక్షన్ల నివారణ చర్యలపై ఆయన దృష్టి సారించారు. శానిటేషన్, స్టెరిలైజేషన్ ప్రక్రియలను కచ్చితంగా పాటించాలని, ఈ విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు.ఈ తనిఖీలలో సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ పి. పద్మజ, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ వి. పద్మజ, ఆర్ఎంఓ డాక్టర్ వెంకట రమణ, ఆసుపత్రి పరిపాలన అధికారులు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రి భాయ్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ఎస్ రంగాపురం లో నూతన డంపింగ్ యార్డ్ ను

# ఏర్పాటు చేయండి మహాప్రభో..

**- ఏళ్ళ తరబడి దుర్వాసన, పొగ తో ఇబ్బంది పడుతుతున్న కాలనీవాసులు ప్రజలు**

**- సంబంధిత అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని కాలనీవాసుల విజ్ఞప్తి**









**బేతంచెర్ల ప్రతినిధి, మే 6 (రిపబ్లిక్ న్యూస్)**
బేతంచర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామంలోని జగనన్న కాలనీవాసులకు, ప్రజలకు నూతన గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని జగనన్న కాలనీవాసులు సూర్య నారాయణ, బాలన్న, బండల బాషా బుధవారం విలేఖరి లకు తెలిపారు. వారు మాట్లాడుతూ..జగనన్న కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ డంపింగ్ యార్డ్ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని, ఆ కాలనీ లో దాదాపు 25 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాం అని వారన్నారు. ఆ డంపింగ్ యార్డ్ నుండి నిత్యం దుర్వాసన, పొగతో బాధపడుతున్నామన్నారు . చెత్త కాల్చడం వల్ల గాలి కాలుష్యం పెరిగి, ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు వాపోతున్నారు. దాని ద్వారా శ్వాసకోశ సమస్యలు పెరుగుతున్నాయని వారు వాపోయారు.సంబంధిత అధికారులు ఈ డంపింగ్ యార్డ్‌ను వేరే ప్రాంతానికి తరలించి, మా ఆరోగ్యం కాపడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని జగనన్న కాలనీవాసులు అంటున్నారు, ఈ విషయం పై డిప్యూటీ ఎంపీడీఓ పరమేశ్వర రెడ్డి మరియు పంచాయతీ సెక్రటరీ ని వివరణ కోరగా
అందుకు వారు స్పందిస్తూ.
మేము రంగాపురం గ్రామ పంచాయతీ నూతన డంపింగ్ యార్డ్ స్థలం కొరకు తహసీల్దార్ ద్రుష్టి కి తీసుకొని వెళ్ళమని, వారు వేరే స్థలం చూపిస్తే నూతన డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తామన్నారు.

# ఆసుపత్రిలో ఆధునిక మార్చురీ ఫ్రీజర్ ఏర్పాటు

## ఆధునిక ఫ్రీజర్ అందించిన మంత్రి సత్యకుమార్





**శ్రీ సత్య సాయి / ధర్మవరం, మే 06,(రిపబ్లిక్ న్యూస్):**
ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిని సమగ్ర వైద్య సేవల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే దృఢసంకల్పంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ నిరంతరం కృషి చేస్తున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడమే లక్ష్యంగా ప్రతి చిన్న సమస్యను గుర్తించి, దానికి తక్షణ పరిష్కారం చూపిస్తూ ప్రజానాయకుడిగా మంత్రి నిలుస్తున్నారని ఆయన కొనియాడారు. ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీ సదుపాయాల కొరతను గమనించిన మంత్రి సత్యకుమార్ యాదవ్, వెంటనే స్పందించి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ.3,71,700 లక్షల వ్యయంతో ఆధునిక సాంకేతికత కలిగిన రెండు మృతదేహాల సామర్థ్యం గల స్టెబిలైజర్‌తో కూడిన మార్చురీ ఫ్రీజర్‌ను ఏర్పాటు చేయించారు. ఇది ఆసుపత్రి సేవల్లో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. బుధవారం ఈ మార్చురీ ఫ్రీజర్ ఏర్పాటు కార్యక్రమాన్ని హరీష్ బాబు స్వయంగా ఆసుపత్రికి వెళ్లి పరిశీలించారు.

**మృతదేహాలు వచ్చిన సందర్భాల్లో భద్రపరచుకునే సౌకర్యం**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మార్చురీలో సదుపాయాల కొరత కారణంగా మృతదేహాలను భద్రపరచడంలో ఇబ్బందులు ఎదురయ్యేవని, ముఖ్యంగా ఒకేసారి ఎక్కువ మృతదేహాలు వచ్చినప్పుడు పరిస్థితి మరింత క్లిష్టంగా మారేదని తెలిపారు. ఇప్పుడు మంత్రి చొరవతో ఏర్పాటైన ఈ ఆధునిక ఫ్రీజర్ వల్ల ఆ సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభించిందని చెప్పారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో లేదా ఒకేసారి ఎక్కువ మృతదేహాలు వచ్చిన సందర్భాల్లో కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా భద్రపరచుకునే సౌకర్యం కల్పించబడడం ద్వారా ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందేలా మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారని ఆయన స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను ముందుగానే అంచనా వేసి, వాటికి అనుగుణంగా సదుపాయాలు కల్పించడం మంత్రి సత్యకుమార్ యాదవ్ నాయకత్వ ప్రత్యేకత అని, ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్రంలో ఆదర్శ ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు ఆయన తీసుకుంటున్న చర్యలు అభినందనీయం అని హరీష్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ధర్మవరం ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత బలోపేతం కావడంతో పాటు, ప్రజలకు నమ్మకాన్ని కలిగించే విధంగా సదుపాయాలు మెరుగుపడుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ తిప్పేంద్ర నాయక్, బీజేపీ నాయకులు బిల్లే శ్రీనివాసులు, ఏలుకుంట్ల లక్ష్మీనారాయణ, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవ ఐక్యతే లక్ష్యం

## ఏఐసిసి జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక







**అనంతపురం సంక్షేమం, మే06,(రిపబ్లిక్ న్యూస్):**
క్రైస్తవ సమాజం రక్షణకు ఐక్యతే ప్రధాన ఆయుధమని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసిసి) అంతర్జాతీయ అధ్యక్షుడు రెవ. డా. గెర హనోక్ స్పష్టం చేశారు. రుద్రంపేట బైపాస్‌లోని వాల్మీకి కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన జిల్లా నూతన కార్యవర్గ ఎంపిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ఏఐసిసి స్టేట్ మహిళా విభాగం అధ్యక్షురాలు రెవ, డాక్టర్ విజయ కుమారి అధ్యక్షత వహించారు. అనంతరం అనంతపురం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు ప్రార్థన ప్రారంభించారు.
ఈ సందర్భంగా అంతర్జాతీయ అధ్యక్షులు, ఇండియన్ పోస్టల్ స్టాంప్ అవార్డు గ్రహీత రెవ: డా గెర హనోక్ మాట్లాడుతూ భారతదేశ చరిత్రలోనే ఎవరు గలమెత్తని విధముగా క్రైస్తవుల పక్షాన పోరాడి అనేక సమస్యలను పరిష్కరించారని తెలిపారు. అందులో భాగంగా కోటి మంది సభ్యత్వంతో ప్రణాళికబద్ధంగా క్రైస్తవ సమాజాన్ని కాపాడుకోవడానికి అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు.

**ఎంపికైన కార్యవర్గానికి నూతన వస్త్రాలు బహుకరణ**

డా: ఎలియాజరు ఏఐసిసి నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ క్రైస్తవుల ఐక్యత, ప్రార్థన చేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులుగా జిల్లా ప్రెసిడెంట్ యెషయా, ఉపాధ్యక్షులువి.మనషే , గౌరవ అధ్యక్షులు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు,అనిల్ మోజెస్,కురాకుల ఐజయా, రాయలసీమ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ వై పి బాబు తదితరులను ఎంపిక చేశారు.వీరితో పాటు 19 విభాగాల అధ్యక్షులుగా క్రైస్తవ నాయకులు జాన్ వెస్లీ , కమల్ , థామస్ , గంధం ప్రకాష్ ,జానీ , స్టేట్ మైనారిటీ టిడిపి క్రిస్టియన్ అధ్యక్షులు ఈటె స్వామి దాసు, చల్లా కిషోర్ చౌదరి కళ్యాణదుర్గం , పాస్టర్ హరికృష్ణ రాయదుర్గం, పాస్టర్ జేమ్స్ పాల్ నాయక్ కళ్యాణదుర్గం, పాలిటెక్నికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ బాలస్వామి , వినోద్ తాడిపత్రి, అరుణ గ్రేస్ కళ్యాణదుర్గం, అడ్వకేట్ రవికుమార్, జాషువా జహంగీర్ , మార్క్,విజయసింహ లను ఎన్నుకున్నారు.అనంతరం గుంటూరు బైబిల్ మిషన్ ఏఓ డాక్టర్ బందెల రాజు,ఎంపికైన కార్యవర్గానికి నూతన వస్త్రాలతో సత్కరించారు. అనంతరం ప్రార్థన ఆశీర్వాదము, ప్రేమ విందుతో కార్యక్రమం ముగిసింది.

# మమతా బెనర్జీ అహంకారం!

**మే 06 (రిపబ్లిక్ న్యూస్):**
ప్రజాస్వామ్యంలో నిరంకుశంగా ఉంటామంటే కుదరదు. ప్రజలు ఎన్నుకుంటే నేతలు..లేదంటే అంతే సంగతులు. భారత ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజ్యాంగ బద్ధంగా ఉండాల్సిందే. కాదూకూడదంటే... కుదరదు. ఇటీవల ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసి..ఫలితాలు కూడా వచ్చేశాయి, బెంగాల్లో బిజెపి అధికారం చేపట్టబోతోంది. తమిళనాడులో నటుడు విజయ్ స్థాపించిన టివికె పార్టీ అధికారం దక్కించు కుంది. ఇంతవరకు ఇవే పెద్ద మార్పులు. కేరళలో ఎల్‌డిఎఫ్ స్థానంలో యూడిఎఫ్ అధికారం కైవసం చేసుకుంది. అసోం, పాండిచ్చేరిల్లో పాత ప్రభుత్వాలే కొత్తగా కొలువుదీర బోతున్నాయి. ఈ క్రమంలో బెంగాల్లో గత పదేహేనేళ్ల మమతా బెనర్జీ పాలనలో అనేక అరాచకాలను చూశాం. తానూ బంగ్లాదేశ్‌లో లాగా ఓ దేశానికి రాణిని అని భ్రమిశారు. అడ్డూ అదుపులేకుండా ఆరాచకాలకు తెలేపారు. చొరబాటుదార్లకు గేట్లు తెరిచారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇచ్చి వారిని పర్మినెంట్‌గా ఓటర్లను చేశారు. కానీ సర్ ప్రక్రియతో ఆమె ఆటలు సాగలేదు. అలాగే ఆమె తీరుతో ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఓట్ల రూపంలో తమ తీర్పును తెలిపారు. 95 శాతం మంది, అందులో మహిళల క్యూలు కట్టి మమతను ఓడించారు. ప్రజల తీర్పును గౌరవించాల్సిన మమతా బెనర్జీ తాను ఓడిపోలేదని, రాజీనామా చేయలనని, బిజెపి వందసీట్లు చోరీ చేసిందని దగుల్బాజీ మాటలు మాట్లాడారు. అసోం, బెంగాల్లో ఓట్ చోరీ జరిగిందని రాహుల్ కూడ వంతపాడారు. మరి తమిళనాడు, కేరళలో ఓట్



చోరీ ఎదుకు జరగలేదో రాహుల్ చెప్పాలి. రాహుల్ ఓట్ చోరీ పేరుతో ఇంకా నాటకాలు ఆడితే ప్రజలు క్షమించరని గుర్తించాలి. విపక్షనేత కూడా మతిభ్రమించి మాట్లాడడం అలవాటు చేసుకున్నారు. మమత బెనర్జీ తాను ఇండియాలో ఉన్న వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశానని అనుకోవడం లేదు. బంగ్లాదేశ్‌లాగా తనది కూడా స్వతంత్ర రాజ్యం అనుకుంటున్నారు. అందుకే రాజ్యంగం విలువ తెలియకుండా మాట్లాడుతున్నారు .ఆ రాజ్యంగమే ఆమెను 15 ఏళ్లపాటు సిఎంగా మోసిందని గుర్తించడం లేదు. ఓటమితో మమతలో అసహనం పెరిగింది. ఏం మాట్లాడాలో తెలియడం లేదు. రాహుల్ ఓట్‌చోరీని సీట్ల చోరీతో పోల్చి మాట్లాడారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని మమతా బెనర్జీ అంటున్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. రాజ్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారం నాడు మమతాబెనర్జీ మాట్లాడుతూ..రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. రాజీనామా చేయకుంటే బర్తరఫ్ చేస్తారని అసోం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ గట్టిగానే హెచ్చరించారు. 15 ఏళ్లపాటు ఇవిఎంలతోనే మమత గెలిచారు. ఇప్పుడేమో ..ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీచేశారని ఆరోపించడం చూస్తే మతి భ్రమించిందనే అనుకోవాలి. ఉద్దేశ్య పూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని కూడా చెప్పుకొచ్చారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించా రనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు
పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. నిజానికి గతంలో మమతా బెనర్జీ పకడ్బందీగా ఇవన్నీ చేశారు. మమతను సుప్రీం కూడా చీవాట్లు పెట్టింది. అయినా ఆమెలో మార్పు రాలేదు. ఆమెను 15 ఏళ్లు భరించడమే ఎక్కువ. ఇలాంటి నేతలు ఉన్నందుకు సిగ్గుపడాలి. ఉమ్మడిగా పోరాటం కోసం తాను 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు. అందుకేనేమో రాహుల్ కూడా ఆమె పట్ల సానుభూతి ప్రకటించారు. కేరళ, తమిళనాడు తప్ప అంతా ఓట్ చోరీ జరగిందని పాత ఆవుకథను మళ్లీ పదేపదే చెప్పారు. నిజానికి పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళం రాష్ట్రాల్లో పాలక పార్టీల, కూటములను ప్రజలు ఓడించి మార్పును కోరుకున్నారు. దేశంలో ఎక్కడా ఉనికిని పెంచుకోలేక పోయిన కాంగ్రెస్‌కు కేరళంలో గెలుపు కొత ఊరటనిచ్చేదిగా ఉంది. కేరళంలో వరుసగా రెండు తడవలు అసాధారణంగా గెలిచిన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం ఓడిపోవడం అన్నది క ఊడా ప్రజలు కోరుకున్న మార్పులో భాగమే. అంతే తప్ప కాంగ్రెస్ మీద ప్రేమతో కాదు. ఇకపోతే
తమిళనాడు ఫలితం అనూహ్యం. ప్రముఖ సినీ నటుడు విజయ్ కొత్తగా పెట్టిన టివికె పార్టీకి వందకుపైన సీట్లొచ్చాయి. మరికొందరిని కలుపుకొని ఆయనే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. మరి ఇక్కడ బిజెపి ఓటు చోరీ చేయలేకనా అన్నది మమతా బెనర్జీ చెప్పాలి. రెండేళ్ల కింద జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె కూటమి క్లీన్ స్వీప్ చేసింది. అంతలోనే డిఎంకెపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడానికి రాజకీయ సమీకరణాలు, సామాజిక అంశాలు ప్రముఖంగా పని చేశాయని అర్థమవుతుంది. బిజెపి ఎంతగా పాకులాడినా తమిళనాట ప్రాంతీయ పార్టీలనే ప్రజలు ఆదరించారు. పశ్చిమబెంగాల్‌లో మమత పార్టీ టిఎంసి అవినీతిమయమైంది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో, శాంతి భద్రతలను పరిరక్షించడంలో ఘోరంగా విఫలమైంది. బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాటు అంశాన్ని రాజకీయంగా ఉపయోగపెట్టుకుంది.
ఇవన్నీ మరచిన మమత తానేదో పునీతురాలినని చెప్పుకోవడం, సిఎంగా రాజీనామా చేయనని ప్రకటించుకోవడం అహంకారంతో కూడిన అవివేకానికి నిదర్శనం. అలా చేస్తే బర్తరఫ్ చేయడం తప్ప మరోమార్గం ఉండదు.

## యూపిలో దారుణ ఘటన

**బాలుడిపై అత్యాచారం హత్య -దుండగుడిని కాల్చి చంపిన పోలీసులు**

**లక్నోమే 06 (రిపబ్లిక్ న్యూస్):**



ఓ కామాంధుడిని ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు కాల్చి చంపేశారు. ఏడేళ్ల బాలుడిపై హత్యాచారం కేసులో ఎన్‌కౌంటర్ చేశారు. పక్కా సమాచారంతో నిందితుడిని పట్టుకునేందుకు వెళ్లగా పోలీసులపై దుండగుడు కాల్పులకు తెగపడ్డాడు. ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరపగా కామాంధుడు హతమయ్యాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది. మంగళవారం నాడు హర్దోయ్ జిల్లా మతియమౌలోని మొక్కజొన్న పొలంలో ఏడేళ్ల బాలుడి మృతదేహం లభ్యమైంది. చిన్నారిని అపహరించిన మెహనూర్ (32) అత్యాచారం చేశాడు. అనంతరం హత్య చేసి మృతదేహాన్ని అక్కడే పడేశాడు. ఈ నేరాన్ని లైంగిక దాడిగా కాకుండా డబ్బుల కోసం చేసిన కిడ్నాప్‌గా చిత్రీకరించేందుకు నిందితుడు ప్రయత్నించాడు. ఈ మేరకు దొంగిలించిన సిమ్ కార్డు సహాయంతో బాధిత కుటుంబానికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. అయితే, వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మేరకు మెహనూర్‌పై రూ.50 వేల రివార్డును పోలీసులు ప్రకటించారు. అయితే, హర్దోయ్ జిల్లా మల్లావన్ ప్రాంతంలో నిందితుడు మెహనూర్ ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. అతన్ని పట్టుకునేందుకు స్థానిక పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సంయుక్త బృందాలు రంగంలోకి దిగాయి. నిందితుడు ఉన్న ప్రాంతానికి చేరుకుని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశాయి. ఈ సందర్భంగా మెహనూర్ ఏకంగా పోలీసులపైకే కాల్పులకు తెగపడ్డాడు. కామాంధుడి దాడిలో సీనియర్ ఎస్ఓజీ అధికారి రాజేశ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు కూడా ఎదురుకాల్పులు జరపగా.. మెహనూర్ ప్రాణాలు కోల్పోయినట్లు పోలీస్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్ తెలిపారు. అతని మృతదేహం వద్ద రెండు తుపాకులు దొరికినట్లు వెల్లడించారు. నిందితుడిని కన్నౌజ్ జిల్లావాసిగా గుర్తించినట్లు చెప్పారు. అతనికి నేర చరిత్ర ఉందని.. పలు జిల్లాల్లో దాదాపు పన్నెండు కేసులు మెహనూర్‌పై నమోదైనట్లు ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడించారు.

-------------

## సినిమా పేరుతో 25 లక్షల మోసం

**సంగీత దర్శకుడు పలాశ్ మచ్చల్‌పై కేసు**

**ముంబయిమే 06 (రిపబ్లిక్ న్యూస్):**



ప్రేమపేరుతో టీమిండియా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన ను మోసం చేసినప్రముఖ సంగీత దర్శకుడు పలాశ్ ముచ్చల్ పై మహారాష్ట్రలోని సాంగ్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. స్మృతి మంధాన స్నేహితుడు విజ్ఞాన్ ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ పరిణామం చోటుచేసుకుంది. విజ్ఞాన్ ప్రకాశ్ తన ఫిర్యాదులో పలాశ్ ముచ్చల్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఒక సినిమా ప్రాజెక్టు కోసం పలాశ్ తన వద్ద నుంచి రూ. 25 లక్షలు తీసుకున్నారని, అయితే ఆ తర్వాత తనను మోసం చేశారని విజ్ఞాన్ పేర్కొన్నారు. గత ఏడాది నవంబరు 22న ఈ విషయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగిందని, ఆ సమయంలో పలాశ్ తన కులాన్ని ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించారని ఫిర్యాదులో వివరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సాంగ్లీ పోలీసులు పలాశ్ ముచ్చల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం పోలీసులు ఈ కేసును విచారిస్తున్నారు. దీనిపై పలాశ్ ముచ్చల్ ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది. పలాశ్ ముచ్చల్ వ్యక్తిగత జీవితం కూడా గత కొంతకాలంగా వార్తల్లో నిలుస్తోంది. ఆయన, క్రికెటర్ స్మృతి మంధాన మధ్య నిశ్చితార్థం జరిగి, పెళ్లి కూడా ఎ÷-లాన్ అయినప్పటికీ అనూహ్యంగా అది రద్దయినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అప్పట్లో సోషల్ మీడియాలో అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. వాటిపై స్పందించిన పలాశ్, ఆధారాలు లేని వార్తలను నమ్మవద్దని, తన వ్యక్తిగత జీవితంపై అనవసర వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొన్నారు. అయితే తాజాగా నమోదైన అట్రాసిటీ కేసుతో పలాశ్ ముచ్చల్ చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కేసు విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు.

------------

## టివికెకు తమిళ కాంగ్రెస్ మద్దతు

**ఏఐసీసీ తమిళనాడు ఇన్‌ఛార్జ్ గిరీశ్ చోడంకర్ ప్రకటన**

**తిరుచ్చి సీటును వదులుకోబోతున్న విజయ్**

**ఆ స్థానంలో త్రిష పోటీ అంటూ సోషల్ మీడియా కూత**

**చెన్నైమే 06 (రిపబ్లిక్ న్యూస్):**
తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు టీవీకే పార్టీకి కాంగ్రెస్ అధికారిక మద్దతు ప్రకటించింది. బేషనరతుగానే ఈ మద్దుతును తెలిపింది. విజయ్ కోరకముందే కాంగ్రెస్ నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యంగా ఉంది. ఎక్కడ అన్నడిఎంకెను కలుపుకుంటారో అన్న భయం కాంగ్రెస్‌లో ఉంది. అందుకే విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మద్దతు తెలుపుతూ ఏఐసీసీ తమిళనాడు ఇన్‌ఛార్జ్ గిరీశ్ చోడంకర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. మతతత్వ శక్తులను కూటమిగా దూరంగా ఉంచాలనే ప్రధాన లక్ష్యం తోనే ఈ మద్దతు ఇస్తున్నట్లు గిరీశ్ చోడంకర్ వెల్లడించారు. తమిళనాడులో లౌకిక, అభ్యుదయ, సంక్షేమ ప్రభుత్వాన్ని అందించడమే తమిళనాడు ప్రజల తీర్పు ఉద్దేశమని గిరీశ్ వ్యాఖ్యానించారు. కేవలం ప్రభుత్వ ఏర్పాటుకే కాకుండా భవిష్యత్తులో జరగబోయే స్థానిక సంస్థలు, లోక్‌సభ, రాజ్యసభ ఎన్నికల్లోనూ టీవీకేతో కలిసి పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. దీంతో తమిళనాడులో కొత్త రాజకీయ సమీకరణాలకు
కాంగ్రెస్- టీవీకే పొత్తు తెరలేపినట్లు అయ్యింది. తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మద్దతు అందించాలని భారత



జాతీయ కాంగ్రెస్‌ను అధికారికంగా కోరారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో టీవీకేకి తమ పూర్తి మద్దతు అందించాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ, కాంగ్రెస్ శాసనసభ పక్షం నిర్ణయించాయి. భారత రాజ్యాంగంపై విశ్వాసం లేని ఏ మతతత్వ శక్తులను కూడా ఈ కూటమిలో చేర్చుకోకుండా టీవీకే దూరంగా ఉంచాలి. ఈ షరతుపైనే మా మద్దతు ఆధారపడి ఉంటుంది. రాబోయే సంవత్సరాల్లోనూ, దశాబ్దాల్లోనూ పెరియార్ సామాజిక న్యాయ ఆదర్శాలకు, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగ ఆదర్శాలకు దృఢమైన నిబద్ధతతో కట్టుబడి ఉంటాం. తమిళనాడులో పెరుంతలైవార్ కామరాజ్ హయాం నాటి రోజులను తిరిగి తీసుకురావడానికి టీవీకే, తమిళనాడు కాంగ్రెస్ మధ్య ఏర్పడిన ఈ కూటమి కృషి చేస్తుంది' అని ప్రకటనలో కాంగ్రెస్ ప్రస్తావించింది. ఇకపోతే టివికె గురువారం ప్రభుత్వ పగ్గాలు చేపట్టనుంది. ఈ క్రమంలో టాలీవుడ్, కోలీవుడ్‌లో గ్లామర్‌కు ప్రతీకగా నిలిచిన త్రిషా కృష్ణన్ రాజకీయ రంగప్రవేశం చేయబోతుందా? ప్రస్తుతం తమిళ రాజకీయాల్లో ఇదే హాట్ టాపిక్‌గా మారింది. టీవీకే అధినేత విజయ్ తీసుకోబోతున్న నిర్ణయాలు, జరుగుతున్న అంతర్గత చర్చలు ఈ ఊహాగానాలకు మరింత ఊపునిస్తున్నాయి. అద్భుతమైన రాజకీయ అరంగేట్రంతో తిరుచిరాపల్లి(తిరుచ్చి) ఈస్ట్, పెరంబూర్ నియోజకవర్గాల్లో ఘన విజయం సాధించిన విజయ్.. ఇప్పుడు ఒకచోట రాజీనామా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆయన తిరుచ్చి ఈస్ట్ స్థానానికి రాజీనామా చేసి, పెరంబూర్ నియోజకవర్గాన్ని అట్టిపెట్టుకోనున్నట్టు తెలుస్తోంది. ఖాళీఅయ్యే ఆ స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలన్న దానిపై టీవీకేలో చర్చలు జోరందుకున్నాయి. అంతకంటే ముఖ్యంగా సోషల్ మీడియాలో పెద్ద డిబేట్సే నడుస్తున్నాయి. టీవీకే ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియదు గానీ.. సోషల్ మీడియాలో నెటిజన్లు మాత్రం బైపోల్ టికెట్ త్రిషకే అని కమిట్ అయిపోతున్నారు. సీఎం అవుతానంటూ గతంలో త్రిష కామెంట్స్ చేయడం.. ఇప్పుడు త్రిష రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లుగా చెబుతున్న విజయ్ పార్టీ టీవీకే గెలుపొందడం.. విజయ్ పోటీ చేసిన రెండింటిలో ఒక చోట బైపోల్ వచ్చే అవకాశం ఉండటం.. వెరసి పరిస్థితులన్నీ త్రిష తన కలను నెరవేర్చుకునేందుకు సహకరిస్తున్నాయా? అని నెట్టింట పెద్ద చర్చే నడుస్తోంది. ప్రస్తుతానికి త్రిష తాను కలగన్నట్లుగా సీఎం అయ్యే అవకాశం లేదుగానీ.. విజయ్ తిరుచ్చి స్థానానికి రాజీనామా చేస్తే మాత్రం.. ఆ స్థానాన్ని త్రిషకు ఇస్తారని.. ఆమెను గెలిపించుకుని ప్రభుత్వంలో కీలక పోస్ట్ ఇస్తారనే ప్రచారమైతే జోరుగా సాగుతోంది. మొత్తంగా.. త్రిష నిజంగానే ఎన్నికల బరిలోకి దిగుతుందా? టీవీకే ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తుందా? లేక ఇవన్నీ కేవలం ఊహాగానాలుగానే మిగిలిపోతాయా? అన్నది తేలాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

-------------

## సామాన్య మహిళగా బస్టాండ్‌లో సీపీ సుమతి...

**పోకిరీల ఆటకట్టు**

**ఆకతాయిల ఆగడాలు అరికట్టేందుకు సీపీ సుమతి స్పెషల్ ఆపరేషన్**


**సాధారణ మహిళగా బస్టాండ్‌లో ఒంటరిగా నిలబడిన సీపీ**

**ఆమెను వేధించిన సుమారు 40 మంది యువకులు**

**పట్టుబడిన వారిలో ఎక్కువ మంది విద్యార్థులే**

**అందరినీ అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు**

**మల్కాజిగిరిమే 06 (రిపబ్లిక్ న్యూస్):**
మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి. సుమతి ఆకతాయిల ఆగడాలపై ఉక్కుపాదం మోపారు. ఈవ్ టీజింగ్‌ను అరికట్టేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగి,






అర్ధరాత్రి ఓ బస్టాండ్‌లో సామాన్య మహిళగా నిలబడ్డారు. ఆమెను గుర్తుపట్టని పోకిరీలు వేధించడంతో, అక్కడే మాటువేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.
వివరాల్లోకి వెళితే.. అర్ధరాత్రి మల్కాజిగిరి పరిధిలోని ఓ బస్టాండ్‌కు సీపీ సుమతి ఒంటరిగా చేరుకున్నారు. ఆమె ఉన్నతాధికారి అని తెలియని సుమారు 40 మంది పోకిరీలు ఆమె చుట్టూ చేరారు. రకరకాల ప్రశ్నలతో ఇబ్బంది పెట్టారు. ఈ క్రమంలో సాధారణ మహిళలు ఎదుర్కొనే వేధింపులను ఆమె స్వయంగా అనుభవించారు. పట్టుబడిన వారిలో ఎక్కువ మంది విద్యార్థులే ఉండటం ఆందోళన కలిగించే విషయం. ఆకతాయిల వేధింపులు శ్రుతి మించడంతో అక్కడికి చేరుకున్న ప్రత్యేక పోలీస్ బృందాలు వారిని అదుపులోకి తీసుకున్నాయి. అనంతరం యువకులందరికీ కౌన్సెలింగ్ ఇచ్చి, భవిష్యత్తులో ఇలాంటి పనులకు పాల్పడవద్దని హెచ్చరించి పంపించారు. మహిళల భద్రత విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని సీపీ సుమతి ఈ ఆపరేషన్ ద్వారా స్పష్టమైన సంకేతాలు పంపారు.



# నితిన్ కొత్త సినిమా మొదలైంది..

యంగ్ హీరో నితిన్ తన కొత్త సినిమాను నేడు లాంఛనంగా ప్రారంభించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ఈ చిత్రం రూపొందనుంది. హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమాలతో ఈ ప్రాజెక్ట్‌ను వైభవంగా మొదలుపెట్టారు. ఈ కార్యక్రమానికి చిత్ర యూనిట్ సభ్యులు హాజరయ్యారు.

ఈ సినిమాతో సోము నర్రి అనే కొత్త దర్శకుడు టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. నితిన్ సరసన 'అశోకవనంలో అర్జున కళ్యాణం' ఫేమ్ రితికా నాయక్ కథానాయికగా నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సురేష్ బొబ్బిలి సంగీతం అందించనున్నారు.

ప్రస్తుతం ప్రారంభోత్సవం జరుపుకున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఈ నెల రెండో వారం నుంచి మొదలుపెట్టాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. వరుస విజయాలతో జోరుమీదున్న సితార సంస్థ, ఈ చిత్రంతో నితిన్‌కు ఒక మంచి కమర్షియల్ హిట్ అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. త్వరలోనే సినిమా టైటిల్, ఇతర నటీనటుల పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

# కొత్త జానర్‌లో నారా రోహిత్..

## ఒక పోస్టర్‌తోనే హైప్




రీసెంట్ గా సుందరకాండ సినిమాతో వినోదభరితమైన ప్రదర్శన ఇచ్చిన ఆయన, ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. దీఎ: రాతీఝుఝుఅఱ ఞుఎంష్ట్రఎఱ రాతీబఅస్త్రుతీఝుజూబ । 6 మీఖఎ 2026 3:12ూవీ ూష్ట్రుతీవ: టాలీవుడ్‌లో కొత్త కాన్సెప్ట్‌లకు ప్రేక్షకుల నుండి వస్తున్న ఆదరణ మధ్య, యంగ్ హీరో రోహిత్ నారా తన కెరీర్‌ను మరింత వైవిధ్యంగా మలుచుకునే దిశగా ముందడుగు వేస్తున్నారు. రీసెంట్ గా సుందరకాండ సినిమాతో వినోదభరితమైన ప్రదర్శన ఇచ్చిన ఆయన, ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. చ=చీ23 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ద్వారా రోహిత్ కొత్త జానర్‌లో తన సామర్థ్యాన్ని చూపించాలనే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా, డెబ్యూ డైరెక్టర్ చినిమిల్లి మణికుమార్‌తో ఆయన కాంబినేషన్ కుదరడం ఈ ప్రాజెక్ట్‌కు స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలుస్తోంది. ఈ మూవీ అనౌన్స్‌మెంట్ పోస్టర్ రిలీజైన వెంటనే సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. షౌటింగ్ సూన్ సరికొత్త ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ పోస్టర్, సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. సాధారణంగా టీజర్ లేదా ఫస్ట్ లుక్ ద్వారా హైప్ క్రియేట్ చేసే ట్రెండ్ మధ్య, కేవలం ఒక పోస్టర్ ద్వారానే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం ఈ టీమ్ స్ట్రాటజీని ప్రత్యేకంగా నిలబెడుతోంది. పోస్టర్‌లో కనిపిస్తున్న కలర్ ఫుల్ డిజైన్ చూస్తుంటే ఇదొక ఫీల్ గుడ్ ఎంటర్టైనర్ అనే సిగ్నల్స్ ను ఇస్తోంది. దీంతో, కథలో ఎమోషన్‌తో పాటు ఎంటర్టైన్‌మెంట్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఉంటుందని అంచనాలు పెరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను కరణ్ సి ప్రొడక్షన్స్ ూఎూ బ్యానర్‌పై భరత్ చౌదరి నిర్మిస్తున్నారు. కొత్త డైరెక్టర్ తో సినిమా చేయడం ఒక రిస్క్ అయినప్పటికీ, కంటెంట్‌పై నమ్మకంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. టాలీవుడ్‌లో రీసెంట్ గా కొత్త దర్శకులు వినూత్న కథలతో మంచి విజయాలు సాధిస్తున్న నేపథ్యంలో, కూడా ఆ జాబితాలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక రోహిత్ నారా కెరీర్ పరంగా చూస్తే, ఇదొక కీలక మలుపుగా మారవచ్చని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. త్వరలోనే శుభ ముహూర్తంతో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. షూటింగ్ మొదలయ్యాక ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్ వివరాలను వెల్లడించనున్నట్లు సమాచారం.

ప్రస్తుతం టైటిల్ కూడా ఫిక్స్ కాలేదు కాబట్టి, టీమ్ ప్లానింగ్ దశలోనే ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించడం గమనార్హం. మొత్తానికి, చ=చీ23 ఒక సాధారణ సినిమా ప్రకటనగా కాకుండా, కంటెంట్ ఆధారంగా హైప్ సృష్టించే కొత్త ట్రెండ్‌కు నాంది పలికే ప్రాజెక్ట్‌గా కనిపిస్తోంది. మరి ఈ సినిమాతో నారా రోహిత్ ఆడియన్స్ ను ఏ మేర ఆకట్టుకుంటారో చూడాలి.

# నేహా శెట్టి అందాల వర్షం..



'డీజే టిల్లు' సినిమాతో యూత్ గుండెల్లో 'రాధిక'గా ముద్ర వేసుకున్న నేహా శెట్టి, తన గ్లామర్‌తో నెటిజన్లను మెస్మరైజ్ చేస్తోంది. తాజాగా మాల్దీవుల సముద్ర తీరాన వైట్ డ్రెస్‌లో మెరిసిపోతూ కొన్ని క్రేజీ ఫోటోలను షేర్ చేసింది. "కాట్ ఏ వైబ్ బై ది సీ" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్, ఆ ఫోటోల్లోని ఆమె స్టైలిష్ లుక్ ఇప్పుడు ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నాయి. అవకాశాల కోసం ఎదురుచూస్తున్నా, సోషల్ మీడియాలో మాత్రం నేహా తన క్రేజ్‌ను అస్సలు తగ్గించుకోవడం లేదు. ఆ విశేషాలు చూద్దాం

వేసవి తాపాన్ని తగ్గించడానికి నేహా శెట్టి సముద్ర తీరాన్ని ఎంచుకుంది. ఈ ఫోటో షూట్‌లో ఆమె ధరించిన తెల్లటి డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'స్టిచ్డ్ అల్మారీ' అనే బ్రాండ్ రూపొందించిన ఈ కస్టమ్ మేడ్ అవుట్‌ఫిట్‌లో నేహా ఎంతో అందంగా కనిపిస్తోంది. ఇక కట్-అవుట్ డిజైన్, కింద వైపు సముద్ర అలల కదలికలను తలపించేలా ఉన్న ఫ్రింజ్డ్ హెమ్ లైన్ ఆమెకు పక్కా రిసార్ట్ వేర్ లుక్‌ను ఇచ్చాయి. ఈ డ్రెస్ నేహా బాడీ లాంగ్వేజ్‌కు సరిగ్గా నప్పింది. 'రాధిక'గా గుర్తింపు.. ఆపై ఒడిదుడుకులు: ఆకాష్ పూరి 'మెహబూబా' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన నేహాకు, అసలైన గుర్తింపు ఇచ్చింది మాత్రం సిద్ధు జొన్నలగడ్డ సరసన నటించిన 'డీజే టిల్లు' చిత్రమే. ఇక అందులో రాధిక పాత్ర ఎంత పాపులర్ అయ్యిందో మనందరికీ తెలిసిందే. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో నటించినా, అవి ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. దీంతో ఈ అమ్మడికి మెల్లగా అవకాశాలు తగ్గాయి. అయితేనేం, సోషల్ మీడియా ద్వారా నిరంతరం ఫ్యాన్స్‌కు టచ్‌లోనే ఉంటూ తన గ్లామర్ పవర్ చూపిస్తోంది.

నేహా శెట్టికి పవన్ కళ్యాణ్ మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఓజీ'లో ఒక స్పెషల్ సాంగ్ చేసే అవకాశం వచ్చింది. అయితే అక్కడ ఆమెకు బ్యాడ్ లక్ వెంటాడింది. ఇక సినిమా లెంగ్త్ ఎక్కువ కావడంతో ఎడిటింగ్‌లో నేహా చేసిన స్పెషల్ సాంగ్‌ను చిత్ర యూనిట్ తొలగించాల్సి వచ్చింది. ఆ తర్వాత ఆ పాటను యూట్యూబ్‌లో విడుదల చేసినప్పటికీ, సినిమాలో ఉంటే వచ్చే ఆ క్రేజ్ మాత్రం రాలేదు. ఇక అయినప్పటికీ నేహా నిరాశ చెందకుండా తన ప్రయత్నాలు కొనసాగిస్తోంది. సరైన బ్రేక్ కోసం ఎదురుచూపులు: ప్రస్తుతం నేహా శెట్టి టాలీవుడ్‌లో ఒక మంచి హిట్ కోసం ఎదురుచూస్తోంది. తనలోని నటనను, గ్లామర్‌ను ప్రూవ్ చేసుకునే అవకాశం వస్తే మళ్ళీ ఫామ్‌లోకి రావాలని ఆశిస్తోంది. అందుకే ఎప్పటికప్పుడు సరికొత్త ఫోటో షూట్లతో మేకర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. ఇక తాజాగా ఆమె పంచుకున్న ఈ బీచ్ ఫోటోలకు నెటిజన్లు "రాధికా.. అదిరిపోయావ్", "బ్యూటిఫుల్ వైబ్" అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. గ్లామర్ విషయంలో నేహా శెట్టికి పోటీ ఇచ్చేవారు తక్కువనే చెప్పాలి.

# జన నాయగన్ ఊపిరి పీల్చుకో

దళపతి విజయ్ తమిళనాడు సీఎం పీఠాన్ని దక్కించుకోవడంతో -జన నాయగన్- ఊపిరి పీల్చుకుంటుందా? అష్టదింగ్భందనానికి గురైనా జన నాయగన్ దిగ్భందనాన్ని తొలగించుకుని బయటకు రాబోతుందా? అంటే అవుననే అనాలి. గత కొంతకాలంగా -జన నాయగన్- విడుదల విషయంలో రకరకాల రాజకీయ, న్యాయ పరమైన, సాంకేతిక సమస్యలు ఎదురైన సంగతి తెలిసిందే. తాజాగా స్వయంగా కథానాయకుడే రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టడంతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సందడి చేయడానికి మార్గం సుగమం అవుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. -జన నాయగన్- సినిమా గత ఏడాదే రిలీజ్ అవ్వాలి. కానీ అందులోని కొన్ని రాజకీయ అంశాలు , డైలాగులు అప్పటి ప్రభుత్వాలకు కంటగింపుగా మారాయనే ప్రచారం జరిగింది. సెన్సార్ బోర్డు దగ్గర నుండి థియేటర్ల కేటాయింపు వరకు సినిమా అడుగడుగునా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది.

సినిమా పేరులోనే -ప్రజా నాయకుడు- అనే అర్థం ఉండటం అది విజయ్ రాజకీయ ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఉండటంతో అప్పట్లో ఈ చిత్రాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని అభిమానులు ఆరోపించారు. తాజాగా తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు చేపట్టడం సినిమాకు అతిపెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. సినిమా విడుదలకు కావాల్సిన అనుమతులు, పంపిణీ వ్యవస్థలో ఉండే ఇబ్బందులు అత్యంత వేగంగా క్లియర్ అయ్యే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి సినిమా అంటే సహజంగానే అంచనాలు ఆకాశంలో ఉంటాయి. గతంలో ఎన్టీఆర్, ఎంజీఆర్ వంటి దిగ్గజాలు కూడా రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత వారి సినిమాలు సంచలనాలు సృష్టించాయి. తాజాగా విజయ్ విషయంలోనూ అదే పునరావృతమయ్యేలా కనిపిస్తోంది. దీంతో ఈ సినిమా విడుదల తేదీపై కోలీవుడ్‌లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. విజయ్ రాజకీయ విజయానికి గుర్తుగా లేదా ఆయన పాలనలో తీసుకునే కీలక నిర్ణయాలకు అనుగుణంగా ఓ ప్రత్యేకమైన రోజున జన నాయగన్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేసే అవకాశం లేకపోలేదు. ఈ చిత్రం ద్వారా ఆయన చెప్పాలనుకున్న సామాజిక సందేశం ఇప్పుడు నేరుగా ప్రజల్లోకి వెళ్తుందని ఇది ఆయన రాజకీయ ప్రయాణానికి కూడా మరింత బలాన్ని ఇస్తుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి కేవలం తమిళనాడులోనే కాకుండా విజయ్‌కున్న గ్లోబల్ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ సినిమాను భారీ స్థాయిలో విడుదల చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సినిమాకున్న అడ్డంకులు తొలగిపోవడమే కాకుండా ప్రభుత్వ మద్దతు కూడా పరోక్షంగా ఉండే అవకాశం ఉండటంతో థియేటర్ల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతాయి. -జన నాయగన్- విడుదలైతే ఇదొక సినిమా మాత్రమే అవ్వదు. ఒక నాయకుడి విజయోత్సవంగా మిగిలిపోతుందని ఫ్యాన్స్ సంబర పడుతున్నారు. కోర్టు వివాదంలో ఉన్న ఈ సినిమా అక్కడా వేగంగానే క్లియరెన్స్ తెచ్చుకునే అవకాశం ఉంది. ఇక -జన నాయగన్- చిత్రానికి కాలం కలిసొచ్చిందనే చెప్పాలి. ఎన్ని అడ్డంకులు ఎదురైనా సరైన సమయం వచ్చినప్పుడు విజయం దానంతట అదే వస్తుందనే దానికి ఈ సినిమానే ఉదాహరణ. విజయ్ ముఖ్యమంత్రి కావడంతో ఈ సినిమాకు ఉన్న క్రేజ్ రెట్టింపు అయింది. త్వరలోనే వెండితెరపై -జన నాయగన్- సందడి మొదలు కానుంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి రికార్డులను తిరగరాస్తుందో చూడాలి.



# 'మైసా' కీలక షెడ్యూల్ పూర్తి.. గిరిజన యువతిగా రష్మిక!

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న తన రాబోయే చిత్రం 'మైసా'కు సంబంధించి కీలక షెడ్యూల్ పూర్తి చేశారు. రవీంద్ర పుల్లే దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం కేరళలో జరిగిన సుదీర్ఘ షెడ్యూల్ తాజాగా ముగిసింది. ఈ విషయాన్ని రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. తన టీమ్‌తో కలిసి దిగిన ఒక చిన్న వీడియోను పోస్ట్ చేసి, ప్రాజెక్ట్ కోసం కష్టపడి పనిచేస్తున్న వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ సినిమాలో రష్మిక మొదటిసారిగా ఒక గిరిజన గోండు యువతి పాత్రలో కనిపించనున్నారు. ఇందులోని హై-ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాల కోసం ఆమె థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నట్లు సమాచారం. అక్కడ రోజూ 8 గంటలకు పైగా కఠినమైన శిక్షణ పొందినట్లు తెలుస్తోంది. యాక్షన్-ప్యాక్డ్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు చిత్రబృందం పేర్కొంది.

'మైసా' చిత్రంలో ఈశ్వరి రావు, గురు సోమసుందరం, రావు రమేష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాతో పాటు రష్మిక మరిన్ని క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. షాహిద్ కపూర్, కృతి సనన్‌లతో కలిసి 'కాక్‌టెయిల్ 2'లో నటిస్తున్నారు. ఇది ఈ ఏడాది జూన్ 19న విడుదల కానుంది. అలాగే విజయ్ దేవరకొండతో కలిసి 'రణబాలి' అనే పీరియడ్ డ్రామాలో



# గ్రామస్థాయిలోనే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందం

**"వన్ మంత్‌వన్ విలేజ్‌ఫోర్ విజిట్స్" కార్యక్రమం అమలు -ప్రతి గురువారం ఒకే గ్రామంలో అధికారులు పర్యటనలు**

**నాలుగు విడతల్లో సమస్యల స్వీకరణ నుంచి పరిష్కారం వరకు చర్యలు**

**రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, మే 06 (రిపబ్లిక్ న్యూస్):**
లిప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, వేగవంతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుండి టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా రెవెన్యూ సంబంధిత సమస్యలను గ్రామస్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా "వన్ మంత్ – వన్ విలేజ్ – ఫోర్ విజిట్స్" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కింద ప్రతి గురువారం రోజున ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, అదే గ్రామాన్ని నెలలో నాలుగు వారాల పాటు అధికారులు సందర్శించాలని కలెక్టర్ సూచించారు. ఈ బృందంలో తహసీల్దార్, ఎంపీడీఓ, వీఆర్ఓ, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, మండల సర్వేయర్, పంచాయతీరాజ్ విభాగం ఏఈ, సాగునీటి శాఖ అధికారులు, అవసరమైతే అటవీ శాఖ అధికారులు పాల్గొని గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు తక్షణ సేవలు అందించడం, పెండింగ్ ఫిర్యాదులను



తగ్గించడం, వివాదరహిత గ్రామాల నిర్మాణం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి మండలంలో ప్రతి నెల ఒక రెవెన్యూ గ్రామాన్ని ఎంపిక చేసి నాలుగు విడతలుగా కార్యక్రమాన్ని అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. మొదటి విడతలో గ్రామంలో ఫిర్యాదుల స్వీకరణ, రికార్డుల ప్రదర్శన, సాధారణ సమస్యల పరిష్కారం చేపట్టాలి. రెండో విడతలో ఫీల్డ్ స్థాయి పరిశీలనలు నిర్వహించి వినతులపై విచారణ చేయాలి. మూడో విడతలో సమస్యల పరిష్కారం, ఆదేశాల జారీ, మ్యూటేషన్లు వంటి చర్యలు తీసుకోవాలి. నాలుగో విడతలో గ్రామ సభ నిర్వహించి పరిష్కరించిన అంశాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. భూమి హక్కుల నమోదు ఆర్ ఓ ఆర్, వెబ్‌ల్యాండ్ సమస్యలు, సర్వే నంబర్లలో పొరపాట్లు, సరిహద్దు వివాదాలు, మార్గ హక్కుల సమస్యలు, కుటుంబ భూ వివాదాలు, ఆక్రమణలు, ఖాతా మార్పిడి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అందిన అన్ని ఫిర్యాదులను పీజీఆర్ఎస్‌లో నమోదు చేసి, సమయపాలనతో పరిష్కరించాల్సిందిగా సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో గ్రామస్థాయిలోనే సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని, ప్రతి వారం కార్యక్రమ పురోగతిని స్వయంగా సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదుల నమోదు, పరిష్కారాన్ని ట్రాక్ చేస్తూ పారదర్శకతను మరింత పెంచుతామని పేర్కొన్నారు. మే 2026 నుండి ప్రతి నెల మొదటి నుండి నాలుగవ గురువారాల వరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తూ, ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు. నిరంతర పర్యవేక్షణతో పారదర్శక పాలన అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

# కళారాధన సేవలు ప్రశంసనీయం: మంత్రి ఫరూక్

**-"కళా సాధన" లలిత కళల వేసవి శిక్షణ శిబిరం కరపత్రాలు ఆవిష్కరించిన మంత్రి ఫరూక్**

**- 25 సంవత్సరాలుగా ప్రతి ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమం: కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు**

**-300 మంది పైగా విద్యార్థులకు నెల రోజులు లలిత కళల ఉచిత శిక్షణ శిబిరం: కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ**

**-డాక్టర్ రవి కృష్ణ కళా సేవలను అభినందించి శాలువతో సత్కరించిన మంత్రి ఫరూక్**

**నంద్యాల మే 6( రిపబ్లిక్ న్యూస్) :**
కళారాధన సాంస్కృతిక సంస్థ ప్రతిఏటా మే నెలలో కళా సాధన పేరిట నిర్వహించే ఉచిత లలిత కళల శిక్షణ శిబిరం కరపత్రాలు, పోస్టర్స్ రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కళారాధన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవి కృష్ణ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ కళారాధన సాంస్కృతిక సంస్థ గత 25 సంవత్సరాలుగా విద్యార్థులకు వేసవిలో ఉచితంగా లలిత కళలలో శిక్షణ ఇవ్వడమే కాకుండా వారితో ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తున్నారని,ఆగస్టులో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని వేలాది విద్యార్థులకు అనేక అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసి వారిలో ఉన్న సృజనాత్మక శక్తుల్ని గుర్తిస్తున్నారని, అనేక పద్య, సాంఘిక, బాలల నాటకాలు తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వ నంది ఉత్సవాలలో, రాష్ట్రవ్యాప్తంగా పరిషత్తులలో ప్రదర్శించి వందలాది బహుమతులు తీసుకువచ్చి నంద్యాల కళా వైభవాన్ని రాష్ట్ర, దేశవ్యాప్తంగా తీసుకువెళ్లారని ప్రశంసించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నెలరోజుల ఉచిత శిక్షణ తర్వాత జూన్ రెండవ తేదీ



కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణను శాలువతో సత్కరిస్తున్న మంత్రి ఫరూక్.

ఎన్టీఆర్ పురపాలక టౌన్ హాల్లో శిక్షణ పొందిన వారి చేత ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ డాక్టర్ రవి కృష్ణ కళా రంగానికి చేస్తున్న సేవలను అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మహమ్మద్ రఫీ, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి,ఐఎంఏ మహిళ విభాగం వైద్యులు డాక్టర్ మాధవి, డాక్టర్ వసుధ ,డాక్టర్ నర్మద,డాక్టర్ శైలజ, డాక్టర్ లలిత, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శులు అన్నెం శ్రీనివాసరెడ్డి, రంగనాథ్, సాహితీ విభాగం కార్యదర్శి డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, శిక్షణ శిబిరం కోచ్ లు శివకుమార్, నాగేంద్ర, మజీద్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కేరళ కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు

**నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యం.యం.డి.ఇమామ్**







**అనంతపురం ప్రతినిధి, మే06,(రిపబ్లిక్ న్యూస్):**
కేరళ కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసి జిల్లా అధ్యక్షుడు వై.మధు సూధన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు అనంతపురం నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 102 స్థానాలలో ఘన విజయం సాధించిన శుభ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు యం.యం.డి.ఇమామ్ నాయకత్వంలో బుధవారం విజయోత్సవ సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తూ టపాసులు కాల్చి, కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు సంతోషంతో సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

**ఈ విజయం కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది**

ఈ సందర్భంగా పత్రికా సమావేశంలో పార్టీ అధ్యక్షుడు యం.యం.డి.ఇమామ్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ గాంధీ గారి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ 102 అసెంబ్లీ స్థానాలను గెలుచుకొని వాయనాడు పార్లమెంట్లో ఏడు నియోజకవర్గాల్లో క్లీన్ స్వీప్ చేసి ఘన విజయం సాధించిందన్నారు. ఈ విజయం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో నాయకుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు. ప్రజలు కూడా పెద్ద ఎత్తున తమ ఓట్ల ద్వారా మార్పుకు స్వాగతం పలికారు, కాంగ్రెస్ పక్షాన నిలిచారన్నారు. అదేవిధంగా రాహుల్ గాంధీ చేపట్టిన ఎన్నికల ప్రచారంలో కూడా పెద్ద ఎత్తున యువత తరలివచ్చి వారి మద్దతు తెలిపారన్నారు. దేశంలో కానీ లౌకిక తత్వ పార్టీ, ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కేరళ ఎన్నికల్లో బిజెపి మతతత్వ పార్టీకి ఓటర్లు గట్టిగా బుద్ధి చెప్పారనీ .. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అధ్యక్షుడు యం.యం.డి.ఇమామ్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ పార్టీ నాయకులు హసీన్ వలి, ముజమ్మిల్, కడియాల జాకీర్, యూసుఫ్, ఇర్షాద్, నరసింహారెడ్డి, శ్రీరామ్ రెడ్డి, ఓబుళపతి, పిండి భాష, సుధాకర్, కార్యకర్తలు రాజు, హరి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వవిద్యాలయంలో కోర్సులకు కౌన్సిలింగ్

**నంద్యాల మే 6( రిపబ్లిక్ న్యూస్) :**
శ్రీ కంచి కామకోటి పీఠం శంకరాచార్య స్వాములవారిచే స్థాపించబడి, 33 సంవత్సరములకు పైగా నిర్వహింపబడుతున్న శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహావిద్యాలయం – డీమ్డ్ యూనివర్సిటీ (కంచి యూనివర్సిటీ)లో 2026–27 వ సంవత్సరానికి గాను ఇంజనీరింగ్, ఆయుర్వేదం, మేనేజ్మెంటు, లా , ఏ హెచ్ ఎస్ మరియు ఇతర యూజీ –పీజీ కోర్సులలో ప్రవేశాలు ప్రారంభమైనవి. తల్లిదండ్రులు, విద్యార్థుల కోరికపై 9 వ తారీకు శనివారం మే 2026 న మన నంద్యాల నగరంలోని శ్రీశైలహైస్కూల్ మరియు భారతి నగర్ లో బీఈడీ కాలేజ్ లో సాయంత్రం 5:00 నుండి 8:00 వరకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ శ్రీనివాసులు సైన్స్‌ప్రొఫెషన్ వెంకటరమణకంచి కామకోటి శంకరమఠం ప్రతినిధులు , పాల్గొని యూనివర్సిటీ సంబంధమైన వివరాలను తెలియజేస్తారు. ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా మెరిట్ స్కాలర్షిప్ విధానంలో ప్రవేశాలు. శాకాహారభోజనం, జిమ్, ఆధునిక క్రీడాస్థలం, చక్కని వసతి సౌకర్యాలు, ఆకర్షణీయమైన ప్లేస్మెంట్సు కలవు. కంచి యూనివర్సిటీలో 70 శాతానికి పైగా ఇంజనీరింగ్ విద్యార్థులు తెలుగు వారే. అర్హత మరియు ఆసక్తి కలిగిన వారికి తక్షణమే స్పాట్ కౌన్సెలింగ్ కూడా కల్పించబడుతుంది.సదరు సమావేశానికి హాజరుకాలేని వారు కంచి యూనివర్సిటీ వెబ్ సైట్ **www.kanchiuniv.ac.in** నుసందర్శించగలరు. సమాచారం కోసం యూనివర్సిటీ ఆఫీసు 9629001144, 8098001630 (ఆయుర్వేద కోర్సు) నంబర్లను, మరిన్ని వివరాల కోసం 9985211440 : 9849706900 గార్లను సంప్రదించగలరు.

# రీ సర్వే పనులు సక్రమంగా నిర్వహించాలి

**జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్**



**అనంతపురం / సెట్టూరు, మే 06,(రిపబ్లిక్ న్యూస్):**
రీ సర్వే పనులు సక్రమంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సెట్టూరు మండలంలోని కైరేవు గ్రామంలో రీ సర్వే పనులలో భాగంగా సర్వేనెంబర్ 25 లో జరుగుతున్న గ్రౌండ్ ట్రూథింగ్ పనులను జాయింట్ కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అలాగే అక్కడ ఉన్న రైతులతో



రీసర్వే వలన ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, లేవా అనే విషయమును మాట్లాడి జెసి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు రీసర్వే అన్నది తమకు ఉపయోగకరంగా ఉన్నదని, ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న గట్టు వివాదాలు పరిష్కారం అవుతున్నావని తెలియజేశారు. అలాగే రీ సర్వే పనులలో ఏవైనా అవకతవకలు అలసత్వం ప్రదర్శించిన సంబంధిత అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏడి సర్వే ఆన్లైన్ రికార్డ్స్, అనంతపురం, తహసిల్దార్ ఈశ్వరమ్మ, మండల సర్వేయర్, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.అనంతరం కైరేవు గ్రామంలో ఉన్న స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ హాజరు రిజిస్టర్, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వేస్తున్నారా, లేదా, సమయమునకు వస్తున్నారా లేదా, ఎన్ని సేవలందిస్తున్నారు, కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేస్తున్నాయా లేదా అన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.అలాగే సెట్టూరు మండలంలోని లక్ష్మంపల్లి గ్రామంలో జరుగుచున్న పట్టాదార్ పాస్ బుక్ ల పంపిణీ ఏ విధంగా జరుగుతున్నదో జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టాదారు పాస్ బుక్ లను పంపిణీ చేయనప్పుడు సంబంధిత విఆర్వోలు పట్టాదారులతో ఏ విధంగా ఈ ఈకెవైసి యాప్ ద్వారా తీసుకుంటున్నారు అనేది జెసి పరిశీలించారు. అలాగే అక్కడ ఉన్న ప్రజలకు ప్రభుత్వము అందించుచున్న సేవల గురించి తెలియజేశారు.

# మహిళల భద్రతే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు.

**..శక్తి యాప్ నీ చెంత ఉంటే.... మీరు పోలీసుల రక్షణలో ఉన్నట్లే.**

**..కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండండి.**




**నంద్యాల మే 06 (రిపబ్లిక్ న్యూస్):**
మహిళలు చిన్నారుల భద్రత మరియు శక్తి యాప్ ప్రయోజనాలపై నంద్యాల జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కల్పించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు జిల్లాలోని పోలీసు అధికారులు వారి పోలీస్ స్టేషన్ ల పరిధిలోని వివిధ గ్రామాలలో మహిళల భద్రత, శక్తి యాప్ వలన కలిగే ప్రయోజనాలు ,సైబర్ క్రైమ్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, బాల్యవివాహాలు, కొత్త చట్టాలు మొదలగు వాటిపై ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి విస్తృతంగా అవగాహన కల్పించడం జరుగుతుంది.
ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, చిన్నారుల రక్షణ కొరకు శక్తి యాప్ ను రూపొందించడం జరిగిందని కావున మహిళలు వారి యొక్క సెల్ ఫోన్లలో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ఆపద సమయంలో పోలీసులు మీ చెంత ఉన్నట్లేనని తెలియజేస్తూ శక్తి యాప్ ప్రయోజనాలపై అవగాహన కల్పించడం జరుగుతుంది.
అంతేకాక జిల్లా ఎస్పీ నంద్యాల జిల్లా వ్యాప్తంగా శక్తి టీం బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ బృందాలు ముఖ్యమైన కూడలలో షాపింగ్ కాంప్లెక్స్ లలో నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రదేశాలలో సంచరిస్తూ మహిళల రక్షణ కొరకు గస్తీ నిర్వహించడంతో పాటు ఉచితంగా అవగాహన కల్పించడం జరుగుతుంది.అంతేకాక సైబర్ క్రైమ్ నేరాలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, రోడ్డు ప్రమాదాలు నివారణ, బాల్య వివాహాల నివారణ, పోక్సో కేసులు, మహిళలపై చిన్న పిల్లలపై నేరాలు మరియు కొత్త చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుంది. అంతేకాక అత్యవసర సమయంలో ఉపయోగించవలసిన టోల్ ఫ్రీ హెల్ప్లైన్ Dail 100, 112, 1930,1972, నంబర్ల గురించి కూడా అవగాహన కల్పించారు.అంతేకాక ఎవరైనా మీ చుట్టుపక్కల ప్రదేశాలలో అనుమానాస్పదంగా సంచరించిన లేదా ఏదైనా చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న అట్టి వారి వివరాలు ప్రతి పౌరుడు మీ బాధ్యతగా పోలీసులకు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని పోలీస్ అధికారులు తెలియజేశారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com